



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





## ఇబ్బంది రానివ్వొద్దు



గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఆందోళన చెందకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పలువురు మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్యాస్ సరఫరా అంశంపై మంత్రులతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిని మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రికి వివరించారు. ఉదయం 11.30 గంటలకు గ్యాస్ సరఫరా అంశంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ భేటీ అవుతున్నట్టు సీఎంకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వపరంగా ఏంచేయాలో, ఎంతచేయాలో అంతా చేయాలని సీఎం ఈ సందర్భంగా మంత్రికి సూచించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుని సమస్య లేకుండా ప్రయత్నం చేయాలని ఆదేశించారు. హోటళ్లు సహా భాగస్వామ్య పక్షాలతో మాట్లాడి.. వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలని మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# గ్యాస్‌పై ఆందోళన వద్దు!

*వంట గ్యాస్ విషయంలో ప్రజల్లో ఎలాంటి ఆందోళన అవసరం లేదని రాష్ట్ర మంత్రులు ముక్తకంఠంతో భరోసానిచ్చారు. పశ్చిమాసియాలో అనిశ్చితి పరిస్థితులున్నా.. దాని ప్రభావం ప్రజలపై పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ముఖ్యమంరితి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వాస్తవ పరిస్థితిని మంత్రుల బృందం నిరంతరం సమీక్షిస్తోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు.*

- కొరత లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు
- సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ, బలోపేతానికి కృషి
- ఆసుపత్రులు, హాస్టళ్ల కార్యకలాపాలకూ ప్రాధాన్యం
- రియల్ టైమ్ డేటా విశ్లేషణతో ప్రణాళికాయుత చర్యలు
- వదంతులు నమ్మొద్దంటూ మంత్రుల బృందం విజ్ఞప్తి




3

## నిండుగా.. పండుగా...

2



తాతల మురిపెం.. అమ్మమ్మ, నాన్నమ్మల ఆశీస్సులు.. అమ్మానాన్నల ప్రేమ.. మేనమామ ఆత్మీయత.. బంధుమిత్రుల ఆశీస్సులతో దేవాన్ష్ నూతన వస్త్ర బహూకరణ వేడుక నిండుగా సాగింది.

## బీసీ 'రక్షణ'కు భరోసా




- త్వరలోనే బీసీ రక్షణ చట్టం అమల్లోకి...
- బీసీల ధన, మాన, ప్రాణ రక్షణకు ప్రాధాన్యం
- బీసీల గౌరవమే కూటమి సంకల్పం
- బీసీ సంక్షేమ మంత్రి సవిత వెల్లడి

4



## నన్ను వేధించడమే కాంగ్రెస్ లక్ష్యం

*'యుద్ధం నేపథ్యంలో దేశ పౌరులపై ప్రభావం పడకుండా ఉండేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇలాంటి కీలక సమయంలో కాంగ్రెస్ బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తుందని భావించాం. కానీ, జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విషయంలో అది మరోసారి విఫలమైంది. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇలా భయాలు సృష్టించి.. నన్ను వేధించాలని చూస్తున్నారు'*

**-అస్సాంలోని సిల్చార్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ**

- జాతీయంలో..



## హర్మూజ్ దాటిన భారత నౌకలు

*భారత్‌తోవున్న మైత్రితో ఇరాన్ సానుకూలంగా స్పందించడంతో.. రెండు భారత జెండాలున్న ఎల్పీజీ నౌకలు శనివారం ఉదయం సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయి. 'శివాలిక్', 'నందాదేవి' నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టులవైపు సురక్షితంగా వస్తున్నట్టు షిప్పింగ్ మంత్రిత్వశాఖ వెల్లడించింది. నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉంది. మార్చి 17న ఇవి భారత్‌కు చేరుకోవచ్చు. దేశంలో ఎల్పీజీ సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోన్న సమయంలో తాజా పరిణామం ఊరట కలిగించే అంశమే.*

- జాతీయంలో..



## ఏపీకి రూ.341 కోట్లు

- విపత్తు ప్రతిస్పందన నిధి కింద కేంద్రం సాయం
- అమిత్‌షా ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ నిర్ణయం

- వివరాలు 5 లో..

## అందరివాడు కోమటి జయరాం



ఏపీ ప్రభుత్వ ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన కోమటి జయరాం అభినందన సభ పోరంకి మురళీ రిసార్టులో ఘనంగా జరిగింది. తెలుగుదేశానికి ఆయన చేసిన సేవలు కొనియాడుతూ అందరివాడు జయరాం అంటూ ప్రశంసలు కురిపించారు.

- ప్రవాస పేజీలో..



మధ్యాహ్న భోజన నాణ్యతపై మంత్రులు, ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్న ప్రభుత్వం నిర్ణయం మేరకు పాలకొల్లులోని ఎంఎంకెఎన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు.

4







# సంప్రదాయబద్ధంగా దేవాన్ష్ నూతన వస్త్ర బహూకరణ వేడుక

హైదరాబాద్ (చైతన్య రథం): సంస్కృతి సంప్రదాయాలను గౌరవించడంలో నారా, నందమూరి కుటుంబాలు ముందుంటాయి. నారా లోకేష్, బ్రాహ్మణిల ముద్దుల తనయుడు దేవాన్ష్ ధోతీ వేడుకను కుటుంబ పరివారం సమక్షంలో అతి సాధారణంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. తాతల మురిపెం.. అమ్మమ్మ, నాన్నమ్మల ఆశీస్సులు.. అమ్మానాన్నల ప్రేమ.. మేనమామ ఆత్మీయత.. బంధుమిత్రుల ఆశీస్సులతో దేవాన్ష్ నూతన వస్త్ర బహూకరణ వేడుక నిండుగా సాగింది. హైదరాబాద్ నివాసంలో కుటుంబీకులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా దేవాన్ష్‌కు నూతన వస్త్రాలు బహూకరించారు. సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందమయ జీవితం గడపాలని ఆకాంక్షిస్తూ దేవాన్ష్‌ను కుటుంబ పరివారం ఆశీర్వదించింది.

# డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు



అమరావతి (చైతన్య రథం): జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "రాష్ట్ర అభివృద్ధిలో, తెలుగు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో జనసేన పోషిస్తున్న పాత్ర అభినందనీయం. ప్రజలకు అండగా నిలుస్తూ వారి భవిష్యత్ కోసం పనిచేస్తున్న జనసైనికులకు, వీరమహిళలకు, నేతలకు శుభాభినందనలు" అని పేర్కొన్నారు.

**పవనన్నకు అభినందనలు**

జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "జనసేన ఏడు సిద్ధాంతాలతో ప్రజాజీవితాల్లో భాగం కావడం చాలా సంతోషం. ఈ శుభసందర్భంలో జనసేనాని పవనన్నకు, నేతలు, కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు" అని పేర్కొన్నారు.



హైదరాబాద్‌లో సినీ నిర్మాత అల్లు అరవింద్ నివాసానికి వెళ్లి నవ దంపతులు శిరీష్, నయనికలను శనివారం ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆశీర్వదించారు. ఇటీవల అల్లు అరవింద్ కుమారుడు శిరీష్ వివాహమైంది. ఈ నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి శిరీష్, నయనికకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.





హైదరాబాద్‌లో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసానికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం వెళ్లారు. ఈనెల 5న వివాహమైన భట్టి విక్రమార్క కుమారుడు సూర్యవిక్రమాదిత్య, సాక్షి దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



చైతన్యరథం

## గిరిపుత్రుల మధ్య జనసేన ఆవిర్భావ వేడుకలు

**పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన పవన్‌కళ్యాణ్**



విశాఖపట్నం (చైతన్యరథం): జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాడేరు నియోజకవర్గంలో నిర్వహించిన వేడుకల్లో జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు. గిరిపుత్రుల మధ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్ర ^మంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరస రఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య తదితరులు హాజరయ్యారు.

## రాజధాని గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు

- పనులు ప్రారంభించిన ఆరు నెలల్లో పూర్తిచేస్తాం
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ
- అనతవరం, నెక్కల్లులో అర్జీల స్వీకరణ



అమరావతి(చైతన్యరథం): రాజధాని గ్రామాల్లో అంతర్జాతీయ ప్రమాణాలు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పురపాలక మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. పనులు ప్రారంభించిన 6 నెలల కాలంలోనే పూర్తి చేస్తామని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, సీఆర్డిఏ అధికారులతో కలిసి అనంత వరం, నెక్కలు గ్రామసభలలో మంత్రి పాల్గొన్నారు. గ్రామాల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ వాటర్, స్టామ్ వాటర్, వీధి దీపాలు, సిమెంట్ రోడ్డు వేస్తాం. గ్రామ కంతాల బయట ఉన్న మౌలిక సదుపాయాలు లెవెల్‌కు సమానంగా గ్రామాలలో నిర్మాణ చేస్తున్నాం. రాజధాని నిర్మాణంలో ప్రస్తుతం 30 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నాటికి అధికారుల, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాలు పూర్తి అవుతాయి. 2027 జూన్ నాటికి రాజధాని 360 కి.మీ ట్రంక్, 1500 కి.మీ లేఅవుట్ రోడ్లు పూర్తి అవుతాయని తెలిపారు. 2028 డిసెంబర్ నాటికి ఐకానిక్ భవనాలు పూర్తి అవుతాయని వెల్లడించారు.

## రాయచోటిలో ఇఫ్తార్ విందుకు ఏర్పాట్లు

- పరిశీలించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి(చైతన్యరథం): పట్టణంలో ఆదివారం జరగనున్న ఇఫ్తార్ విందు ఏర్పాట్లను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఇఫ్తార్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరా రు. ఇఫ్తార్ కార్యక్రమానికి మైనార్టీ న్యాయ శాఖ మంత్రి ఫరూక్ హాజరుకానున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరుగనున్న ఇఫ్తార్ కార్యక్రమం ఏర్పాట్లను టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, యువనాయకులు మౌర్యారెడ్డి, మున్సిపల్, పోలీసులు, ఇతర అధికారులు, మైనార్టీ నేతలతో మంత్రి పరిశీలించారు. వేలాది సంఖ్యలో హాజరయ్యే ఈ కార్యక్రమానికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వసతి కల్పిం చాలని సూచించారు. ఇఫ్తార్ కార్యక్రమానికి వచ్చే వారికి ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు.

# గ్యాస్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందుల్లేవు

- ఆన్‌లైన్‌లోనే బుకింగ్..ఓటీపీ ఉంటేనే పంపిణీ
- ఆందోళనతో ఎక్కువ మంది బుక్ చేస్తున్నారు
- కుటుంబ అవసరాలకు లోటు లేదు
- మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు



అమరావతి(చైతన్యరథం): గ్యాస్ సరఫరా విషయంలో పరిస్థి తులను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ మార్గాల వైపు కూడా దృష్టి సారించి ముందుకెళుతున్నట్లు చెప్పారు. గ్యాస్ సరఫరా అంశంపై మంత్రులు పయ్యావుల, అచ్చెన్నాయుడు శని వారం అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి పయ్యావుల మాట్లాడుతూ "ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. అందరూ సహక రించాలి. ఆందోళనతో ఎక్కువమంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేస్తు న్నారు. కుటుంబ అవసరాలకు ఏమాత్రం లోటు లేకుండా చేయ డానికే మా తొలి ప్రాధాన్యం. పైప్డ్ గ్యాస్ కంపెనీలతోనూ సమా వేశమవుతాం. సిలిండర్ బుకింగ్ ఆన్‌లైన్‌లోనే ఉండాలని స్పష్టం చేశాం. సిలిండర్ కావాలంటే ఓటీపీ ఉంటేనే ఇస్తారు. బ్లాక్ మార్కెటింగ్‌కు తరలిపోకుండా ఓటీపీ పద్ధతిలోనే సిలిండర్ ఇస్తా రు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తీసు కుంటామని తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. రిఫైనరీల్లో గ్యాస్ ఉత్పత్తి పెంచేందుకు కేంద్రం ఆదేశాలు జారీ చేసిందని, వంట గ్యాస్ సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఆసుపత్రులు, హాస్టళ్లకు గ్యాస్ సరఫరాకు అంతరా యం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాస్థాయిలోనూ పరిస్థితిని సమీక్షించేందుకు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పైప్డ్ గ్యాస్ వినియోగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిపారు. వదంతులు నమ్మ వద్దని ప్రజలకు ప్రభుత్వ విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో గ్యాస్ కష్టాలు లేవు

- ఆర్టీజీఎస్ నిఘాలోనే సరఫరా చేస్తున్నాం
- ప్రతి ఆరు గంటలకు స్టాక్ పాయింట్ల తనిఖీ
- గృహ అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యం
- పుకార్లు నమ్మొద్దని పౌరసరఫరాల శాఖ



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌పీజీ సరఫరాపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు నిండుకున్నా యని, సరఫరా నిలిచిపోతుందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో గ్యాస్ పరిస్థితి పూర్తిగా ప్రభుత్వ నియంత్ర ణలోనే ఉందని వెల్లడించింది. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 161.19 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఐవోసీఎల్ పరిధిలో 56.86 లక్షలు (36.07 లక్షల సింగిల్ బాటిల్/ 20.79 లక్షల డబుల్ బాటిల్) ఉన్నాయి. హెచ్‌పీసీఎల్ పరిధిలో 74.11 లక్షలు (45.36 లక్షల సింగిల్ బాటిల్ / 28.75 లక్షల డబుల్ బాటిల్) ఉన్నాయి. బీపీసీఎల్ పరిధిలో 30.22 లక్షలు (19.09 లక్షల సింగిల్ బాటిల్/11.13 లక్షల డబుల్ బాటిల్) ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా రోజువారీ గృహ అవసరాలకు 4,000 మెట్రిక్ టన్నుల (మీ) గ్యాస్ అవసరం అవుతుండగా ఈ నెల 12 నాటికి 15,880 మెట్రిక్ టన్నుల నిల్వలు సిద్ధంగా ఉన్నాయి. ఇది రాష్ట్ర అవసరాలకు దాదాపు 4 రోజులవరకు సరిపోతుందని ప్రభుత్వం వివరించింది. దేశవ్యాప్తం గా ఇంధన కొరత ఉందన్న తప్పుడు ప్రచారం వల్ల వినియోగదా రులు ఆందోళనకు గురై సాధారణం కంటే 15 శాతం అదనంగా రీఫిల్ బుకింగ్స్ చేసుకుంటున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని పంపిణీలో పారదర్శకత కోసం ఓటీపీ ఆధారిత డెలివరీ విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నారు. ప్రస్తు త పరిస్థితుల్లో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. పరిశ్రమలకు ఇచ్చే బల్క్ ఎల్‌పీజీ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసింది. వాణిజ్య అవసరాలకు ఇచ్చే సరఫరాపై కఠినమైన ఆంక్షలు విధించింది. కేవలం ఆసు పత్రులు, హాస్టళ్లు, ప్రభుత్వ సేవలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతి ఆరు గంటలకు ఒకసారి స్టాక్ పాయింట్లను తనిఖీ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించింది. రాష్ట్ర సచివా లయంలోని ఆర్టీజీఎస్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రెవెన్యూ, పోలీస్, పౌరసరఫరాలు, ఆయిల్ కంపెనీల ప్రతినిధుల తో సమన్వయం చేసుకుంటున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ, మంత్రుల బృందం ఎప్పటికప్పుడు పరిస్థితి ని సమీక్షిస్తున్నాయి. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా 'సోషల్ మీడియా మానిటరింగ్ సెల్'ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. పుకార్లు నమ్మి అనవసరంగా గ్యాస్ బుకింగ్స్ చేయవద్దని, అందరికీ సకాలంలో గ్యాస్ అందుతుందని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

# ప్రజల గుండెల్లో ఎన్టీఆర్‌కు సుస్థిర స్థానం

- తనయుడు నందమూరి రామకృష్ణ
- పాతాళభైరవి 75 ఏళ్ల వేడుకలు



విజయవాడ (చైతన్యరథం): తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సొంతం చేసుకున్న మహానుభావుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామ కృష్ణ అన్నారు. ఎన్టీఆర్ నటించిన పాతాళ భైరవి సినిమా రిలీజ్ అయ్యి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో విగ్రహానికి ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎంపీ కేశినేని శివనాథ్, మైలవరం ఎమ్మె ల్యే వసంత కృష్ణప్రసాద్ తదితరులు ఘన నివాళులర్పించారు.

ఎన్టీఆర్ సినీ, రాజకీయ రంగాల్లో చేసిన సేవలను ఈ సందర్భం గా ఎంపీ శివనాథ్‌తో పాటుగా ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కొనియాడారు. నటుడిగానే కాకుం డా రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన మహోన్నత నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. తెలుగు జాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఎన్టీఆర్ చిరస్మరణీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, నాయకులు కోనేరు కిషోర్, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొనగా నందమూరి రామకృష్ణను ఈ సందర్భం గా ఎంపీ శివనాద్ తదితరులు ఘనంగా సత్కరించారు. పాతాళ భైరవి సినిమా విడుదల అయ్యి 75 సంవత్సరాల పూర్తయిన సంద ర్భంగా ఎన్టీఆర్ అభిమానులు, టిడిపి నాయకుల సంబరాల నడుమ కేక్ కోశారు.



# అమరజీవి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు

**తుళ్లూరు స్మృతివనంలో మంత్రి సవిత పర్యటన - 16న సీఎం చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభం**

తుళ్లూరు/అమరావతి(చైతన్యరథం): అమరజీవి పొట్టి శ్రీరాము లు ప్రాణత్యాగం వృథా కానివ్వబోమని, ఆంధ్రజాతి కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న లక్ష్యంతోనే పొట్టి శ్రీరాముల స్మృతివనం ఏర్పాటు చేస్తున్నామని బీసీ, ఈడబ్ల్యూ ఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల అమరజీవి కాంస్య విగ్రహాన్ని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సభ్యులు ఏర్పాటు చేయడం అభినందనీ యమని కొనియాడారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరు లో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంలో ఏర్పాటు చేస్తున్న పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహ ఏర్పాటు పనులను మంత్రి సవిత శనివారం పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు పనులు ఎంతవరకూ వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నానికే విగ్ర హాన్ని సిద్ధం చేయాలని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సభ్యులకు సూచించారు. అనంతరం స్మృతివనం సమీపంలో ఏర్పాటు చేస్తున్న సభ స్థలి ఏర్పాట్లను కూడా పరిశీలించారు. పొట్టి శ్రీరాముల విగ్రహావిష్కరణకు ప్రజలు భారీఎత్తున తరలిరానున్నా రని, ఏర్పాట్లలో అలసత్వం చూపొద్దని దిశా నిర్దేశం చేశారు. ఎవ్వరికీ ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టంచేశారు. సాధారణ, వీఐపీ గ్యాలరీల ఏర్పాటు తో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ రాజధాని అమరావతిలో 6.8 ఎకరాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నాం. స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ నామకరణంతో 58 అడుగుల ఎత్తు మేర ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఈ విగ్రహాన్ని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సభ్యులు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఈ నెల 16వ తేదీన 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని సీఎం చంద్రబాబు చేతులమీదుగా ఆవిష్కరించ బోతున్నామని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, పలువురు మంత్రులు పాల్గొంటారని తెలిపారు.

**రూ.3 లక్షల విరాళాలు**

తుళ్లూరులో ఏర్పాటు చేస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహ ఏర్పాటుకు ముగ్గురు ఆర్యవైశ్య సామాజిక వర్గీయు లు రూ.3 లకలు విరాళంగా మంత్రి సవితకు అందజేశారు. విరా ళాలు అందజేసిన కొత్తూరు గంగాధర్, నాగుబండి ప్రకాశ్‌రావు, కె.వెంకటేశ్వరరావును మంత్రి అభినందించారు. అనంతరం శ్రీమద్భగవద్గీత హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీలో త్వరలో బీసీ రక్షణ చట్టం




- 15 రకాల వేధింపులకు శిక్షలు
- గౌరవప్రద జీవనమే కూటమి సంకల్పం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- బీసీ రక్షణపై మంత్రుల కమిటీ భేటీ
- పాల్గొన్న మంత్రులు అచ్చెన్న, కొల్లు రవీంద్ర, సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్

విజయవాడ(చైతన్యరథం): వెనుబడిన తరగతులకు చెందిన 138 కులాలకు రక్షణ కల్పించేలా బీసీ రక్షణ చట్టం రూపొందిస్తున్నామని, త్వరలోనే ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నామని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. బీసీలను కులం పేరుతో, వృత్తి పేరుతో దూషించి నా, సాంఘిక బహిష్కరణలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత నేతృత్వంలో శనివారం నిర్వహించిన బీసీ రక్షణ చట్టం భేటీలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీం ద్ర, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ పాల్గొన్నారు. మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన అన్నీ హామీలను నెరవేరు స్తున్నామని, ఈ నేపథ్యంలో త్వరలోనే బీసీ రక్షణ చట్టాన్ని అమ ల్లోకి తీసుకురానున్నామని తెలిపారు. చట్టం రూప కల్పనకు తుది రూపు ఇవ్వడానికే బీసీ మంత్రులతో కీలక భేటీ నిర్వహించామని వివరించారు. ఇదివరకే రెండు పర్యాయాలు బీసీ మంత్రులు సమావేశమయ్యాం. ఇప్పటికే బీసీ చట్టం ముసాయిదా కూడా సిద్ధం చేశాం. బీసీల ధన, మాన, ప్రాణాలకు భరోసా కల్పించేలా బీసీ రక్షణ చట్టాన్ని పటిష్టంగా రూపొందిస్తున్నామని వివరించారు. 15 రకాల వేధింపులకు శిక్షలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. బీసీ మంత్రుల భేటీ వివరాలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించాం. దేశంలోనే తొలిసారిగా ఏపీలో బీసీ రక్షణ చట్టం అమలు చేయబోతున్నామని వివరించారు. బీసీ రక్షణ చట్టం డ్రాఫ్ట్ పై బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 జోన్‌లలో ఉన్న బీసీ సంఘాలు, ప్రతినిధుల అభిప్రాయాలు కూడా తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించా మని తెలిపారు. బీసీలకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**వివాదాలకు తావులేకుండా చట్టం: అచ్చెన్న, కొల్లు రవీంద్ర**

అంతకుముందు నిర్వహించిన భేటీలో బీసీ చట్టం రూప కల్పనలో తీసుకున్న జాగ్రత్తలు, నిపుణులు సూచనలు గురించి బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ వివరించారు. కేంద్ర అడ్వకేట్ జనరల్, జాతీయ బీసీ కమిషన్ సలహాలు సూచనలను కూడా ఏపీ బీసీ రక్షణ చట్టం రూపకల్పనలో పరిగణలోకి తీసుకు న్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు కొల్లు రవీంద్ర, కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బీసీ చట్టానికి తుదిరూపు ఇచ్చే క్రమంలో రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలతోనూ చర్చించా లని కోరారు. ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా బీసీ రక్షణ చట్టం రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, సత్య కుమార్ యాదవ్, లా జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వరరావు వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు

- పరిశీలించిన హోంమంత్రి వంగలపూడి అనిత
- అధికారులకు పలు సూచనలు చేసిన మంత్రి
- కట్టుదిట్టంగా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశం

విశాఖపట్నం/నక్కపల్లి(చైతన్యరథం): నక్కపల్లి ప్రాంత పారిశ్రామికాభివృద్ధిలో కీలక ఘట్టంగా నిలిచే స్టీల్ ప్లాంట్ శంకు స్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఈ నెల 23న నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబా బు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు. స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన చేయనున్న ప్రాంతాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత శనివారం పరిశీలిం చారు. అధికారులతో కలిసి వేదికను, పరిసర ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. భారీ సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, అతిథులు తరలివచ్చే అవకాశముండటంతో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండే లా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా శంకుస్థాపన వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# విద్యార్థులతో మంత్రి నిమ్మల భోజనం

- మధ్యాహ్న భోజన నాణ్యతపై అకస్మిక తనిఖీ
- మున్సిపల్ పాఠశాలలో యోగ మందిరం ప్రారంభం

పాలకొల్లు(చైతన్యరథం): పట్టణంలోని ఎంఎంకెఎన్ మున్సిప ల్ ఉన్నత పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రతిరోజూ అందిస్తున్న భోజనం నాణ్యత ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగా లనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజన నాణ్యతను ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా పరిశీలించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. భోజన నాణ్యతలో ఎక్కడైనా లోపాలు ఉంటే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. గత ఐదేళ్లలో చేయలేని ఉపాధ్యాయుల భర్తీని కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే పూర్తి చేసిందన్నారు. "ఒక తరగతి – ఒక ఉపాధ్యాయుడు" విధానం వల్ల విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అంతకుముందు యోగ మందిరాన్ని ప్రారంభించారు.

# ఏపీకి రూ.341 కోట్ల కేంద్రసాయం

- విపత్తు ప్రతిస్పందన నిధి కింద కేటాయింపు
- అమిత్‌షా ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ నిర్ణయం

అమరావతి (చైతన్యరథం): జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్డీఆర్ఎఫ్) నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.341.48 కోట్ల సాయం ప్రకటించింది. గతేడాది సంభవించిన వరదలు, ఆకస్మిక వర్షాలు, మొంథా తుపాను, కొండచరియలు విరిగిపడటం కారణంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, కేంద్రపాలిత ప్రాంతం జమ్మూ కశ్మీర్‌లకు కలిపి మొత్తం రూ.1,912.99 కోట్ల సాయం చేయా లని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి కమిటీ నిర్ణయించింది. అందులో ఏపీకి రూ. 341.48 కోట్లు (17.85%) కేటాయించింది.

# గిరిజనుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

## మాట ఇచ్చాం..పనులు చేస్తాం: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ భరోసా



అమరావతి (చైతన్యరథం): ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ స్పష్టం చేశారు. పాడేరు నియోజకవర్గం నందిగరువు గ్రామంలో శనివారం నిర్వహించిన 'గిరిజనులతో మాటామంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జనసేన పారీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'డోలి మోత'లతో ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామం నుంచి మార్పు మొదలు కావాలని, అందుకే ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'సమస్యలు ఏవైనా రాత్రికి రాత్రే పరిష్కారం కావు. కానీ పరిష్కరించాలనే సంకల్పం మాకుంది. గత ప్రభుత్వంలో ఈ నిధులు ఏమయ్యాయో మీరు వైసీపీ నాయకులను నిలదీయాలి. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికే 460 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాం. పార్టీలతో సంబంధం లేకుండా నిధులు కేటాయిస్తున్నాం. నాయకులకు ఈ ప్రాంతాలకు రావాలంటేనే భయం. కానీ, నేను ప్రజల కోసం పనిచేసే వ్యక్తిని కాబట్టి ఎవరికీ భయపడను. మీ సమస్యలు తెలుసుకోవడానికి ముందుకు వచ్చాన ని' తెలిపారు. నందిగరువు గ్రామస్తుల విన్నపం మేరకు కొత్త పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, 1.6 కిలోమీటర్ల మేర నూతన రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామంలో మ్యాజిక్ డ్రైన్లు మంజూరు చేశారు. అలాగే సుమారు 3 వేల గ్రామాలకు తాగు నీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు వెల్లడించా రు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధికి కీలకమైన జీవో నెంబర్ 3 పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి సానుకూ ల నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

# విశాఖలో మంత్రి నారాయణ పర్యటన

- సీతమ్మధారలోని స్లమ్ ఏరియా పరిశీలన
- ఏఎస్ఆర్‌నగర్‌ను ఆధునికీకరిస్తామని వెల్లడి
- ఎయిర్‌పోర్టు ప్రారంభం నాటికి మాస్టర్ ప్లాన్ రోడ్లు



విశాఖపట్నం (చైతన్యరథం): ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ గోపాల్, అధికారులతో కలిసి మంత్రి పొంగూరు నారాయణ విశాఖలో పర్యటించారు. సీతమ్మధారలోని స్లమ్ ఏరియాను పరిశీలించారు. మురికివాడలో ప్రజలు ఎదుర్కొం టున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్‌ను కలిపే మాస్టర్ ప్లాన్ రోడ్లు పరిశీలించారు. నేరెళ్లవలస నుంచి కొత్తవలస, బోయపాలెం నుంచి కాపులుప్పాడ, భీమిలి నుంచి దొరతోట జంక్షన్‌కి వెళ్ళే రోడ్లను పరిశీలించారు. భోగా పురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం నాటికి మాస్టర్ ప్లాన్ రోడ్లు దాదాపు పూర్తి చేస్తామని తెలిపారు. విశాఖపట్నం నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు వీలుగా రోడ్లు నిర్మిస్తున్నామని, ఇప్పటికే 54 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. వీఎంఆర్‌డీఏ, ఆర్అం డ్‌బీ, జీవీఎంసీ వేరువేరుగా నిర్మాణం చేస్తున్నాయని వివరించారు. సీతమ్మధార ఏఎస్ఆర్‌నగర్‌లో మురికివాడను ఆధునికీకరిస్తామని తెలిపారు. ప్రైవేటు భూమిలో ఏళ్ళతరబడి సుమారు 200 కుటుం బాలు తాత్కాలిక ఇళ్లు, షెడ్‌లు నిర్మించుకుని నివసిస్తున్నారు. ఇళ్లు తొలగిస్తామని స్థానికులు ఆందోళన చెబుతున్నారని, భూమి యజమానులతో మాట్లాడి ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# దందాలు.. ఆక్రమణలు... మోసాలు

- న్యాయం కోరుతూ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ
- అర్జీలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పరుచూరి అశోక్‌బాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రీవెన్స్ రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు వచ్చారు. వినతులు ఇచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రామకృష్ణ అభ్యర్ధన... మంగళగిరి మండలం ఆత్మకూరు పరిధిలో నా సొంత స్థలాన్ని నకిలీ పత్రాలతో మరొకరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2007లో ఖాళీ నివేశన స్థలాన్ని రిజిస్టర్ చేయించుకుని, దానికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు, ప్రభుత్వ పత్రాలను కలిగి ఉన్నాను. 2022లో ఆత్మకూరుకు చెందిన వైసీపీ మహిళ నేత ఒక వ్యక్తితో ఎటువంటి ప్రభుత్వ పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు లేకుండా కేవలం ఒక ప్రైవేట్ సర్వేయర్ రిపోర్టును ఆధారంగా చూపుతూ దౌర్జన్యంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ వ్యక్తి నా పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తిగా తప్పుడు సమాచారం ఇచ్చి మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2022లో (దస్తావేజు నెం.9196/2022) రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై సంబంధింత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా నాగరత్నం అర్జీ... మేము టీడీపీ కార్యకర్తలమనే కక్షతో మాపై గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బి.మద్దిలేటి రెడ్డి సర్వే నెంబర్లు 694లో మా భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. అడ్డుకున్న మాపై తప్పుడు కేసులు బనాయించారు. భూ కబ్జాదారుడికి వత్తాసు పలికిన డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి సామేలు, డిప్యూటీ తహసీల్దారు వల్లెపు చంద్రశేఖర్, ఆర్ఐ పెద్దముంతల శ్రీరంగారెడ్డి, వీఆర్వో పుల్లగూరు సాయిబాబా, సర్వేయరు బండారు సుధాకర్, తలారి రమణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

గుంటూరు జిల్లా తాడికొండకు చెందిన భీమవరపు రాధారాణి అర్జీ ఇదీ... నా భర్త చనిపోయిన తర్వాత పిల్లలను కష్టపడి చదివించుకున్నాను. ఇల్లు కట్టుకోవాలనే ఆశతో దాచుకున్న సొమ్మును ఈదా శామ్యూల్‌రెడ్డి, ఈదా అంజిరెడ్డి నడుపుతున్న శ్రీభవిత పరివార్ ప్రొడ్యూసర్ కంపెనీ, సుగుణ చిట్స్, భవిత నిధి వంటి సంస్థల్లో పెట్టుబడి పెట్టాను. వివిధ స్కీముల ద్వారా సుమారు రూ.51,64,520 డిపాజిట్ చేశాను. కుటుంబ స్నేహాన్ని అడ్డుపెట్టుకుని అత్యవసరమని నమ్మించి నా వద్ద 108 గ్రాముల బంగారం తీసుకున్నారు. తిరిగి ఇవ్వమంటే సదరు కంపెనీల యజమానులు కాలయాపన చేస్తూ వచ్చారు. గత ఏడాది అక్టోబరులో డబ్బుల విషయమై నిలదీయగా శామ్యూల్ రెడ్డి కుటుంబ సభ్యులు, అంజిరెడ్డి కలిసి నాపై అమానుషంగా దాడి చేశారు. కర్రలతో కొట్టడమే కాకుండా ఫోన్ ద్వారా శామ్యూల్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉరివేసి చంపేందుకు ప్రయత్నిం చారు. అదృష్టవశాత్తూ నా కుమారుడు సమయానికి చేరుకుని ప్రాణాలను కాపాడాడు. మళ్లీ కనిపిస్తే ముక్కలు ముక్కలుగా నరికి పెట్రోల్ పోసి తగలబెడతామని బెదిరించారు. శామ్యూల్‌రెడ్డి చనిపోయిన కుమార్తె 'స్పందన' పేరుతో ఫౌండేషన్ స్థాపించి, పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు, కలెక్టర్లతో ఫొటోలు దిగి.. ఆ పలుకుబడిని చూపి సామాన్యులను నమ్మించి వందలాది మందిని ముంచేశారు. కావునా వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం పొరూరు గ్రామానికి చెందిన బాలకృష్ణ సమస్య... స్వాతంత్ర్య సమరయోధుడైన నా తండ్రికి అప్పటి ప్రభుత్వం సంతబొమ్మాళి మండలం కాకరాపల్లి గ్రామ పరిధిలో ఐదెకరాల భూమి కేటాయించింది. ఆయన మరణించాక స్థానిక రైతులు కొందరు ఆ భూమిని సాగు చేసుకుంటూ ఇప్పుడది మాది కాదని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పాత సర్వే నెంబర్లు 244, 612. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేను ఆసరాగా చేసుకుని, సర్వే నెంబర్లు మార్చేసి... ఆ భూమిని వారి పేరిట మార్చుకోవాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. అధికారులను తప్పుదోవ పట్టిస్తూ వారసత్వం గా నాకు రావాల్సిన భూమిపై హక్కును కాలరాస్తున్నారు.

పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడు గ్రామానికి చెందిన రామాంజనేయులు అర్జీ.... నా తండ్రి ఓర్సు వెంకటయ్య, తల్లి శాయమ్మలకు ఎకరం సాగు భూమి ఉంది. తండ్రిని, ఆయన మరణానంతరం తల్లిని పోషిస్తున్నాను. దీంతో ఆమె ఆ భూమిని నాకు రాసిచ్చింది. నా అన్న కుమారుడైన ఓర్సు వెంకటేశ్వర్లు తప్పుడు పత్రాలు సృష్టించి ఆ భూమిని అతడి పేరిట మార్చుకు న్నాడు. అధికారులను తప్పుదోవ పట్టించి ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయించుకుని పట్టాదారు పాసు పుస్తకం కూడా పొం దాడు.

గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన శాంతి విజ్ఞప్తి ఇదీ... మార్తమ్మకు ప్రభుత్వం 2.54 సెంట్ల పొలం (సర్వే నెం.147/29, 390/36, 390/4) 10 సెంట్ల ఇళ్ల స్థలం మంజూరు చేసింది. కోమల నాగేశ్‌కి ప్రభుత్వం 2.54 సెంట్ల పొలం (సర్వే నెం. 147/29-20), 10 సెంట్ల ఇళ్ల స్థలాన్ని మంజూరు చేసింది. మొత్తం 5.28 సెంట్ల భూమిని ప్రభుత్వం మాకు కేటాయించినా మా ఆధీనంలో లేదు. వీటిని సముద్రాల చేరిబాబు, బాలకాని రాజేశ్వరరావు ఆక్రమించుకున్నారు. భూమి అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు.

అన్నమయ్య జిల్లా పీలేరు మండలం బోదెంవారిపల్లికి చెందిన సత్యనారాయణ అర్జీ... మా గ్రామంలోని సర్వే నెం.144లో నా తండ్రి కృష్ణమూర్తికి 19 సెంట్ల భూమి ఉంది. మా వద్ద రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు, ఈ-పాస్‌బుక్ (ఖాతా నెం.1538) ఉన్నాయి. 2010లో ఈ ప్రాంతంలో ఎన్జీవో కాలనీ ఏర్పడే సమయంలో రోడ్డుకు భూమి అవసరమైంది. నా తండ్రి సామాజిక బాధ్యతగా 12 సెంట్లు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. మిగిలిన 7 సెంట్లను సర్వే చేసి, సరిహద్దులు నిర్ణయించాలని కొంతకాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన సర్వే ఫీజు కూడా చెల్లించాం. అయినా మండల సర్వేయర్ నుంచి ఎటువంటి స్పందనా లేదు.

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం వరిణి గ్రామానికి చెందిన మాధవరావు అర్జీ... మా గ్రామ సర్పంచ్ రావెళ్ళ మల్లికార్జున సర్వే నెం.59/1లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని దౌర్జన్యంగా ఇంటి నిర్మాణం కొనసాగిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆయన తండ్రి ద్వారా ఈ భూమి సంక్రమించిందని ఒక నకిలీ పత్రాన్ని చూపించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేయగా అసలు డాక్యుమెంట్లు చూపించడంలో సర్పంచ్ విఫలమయ్యారు. ఆయ నపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి.

వీటితో పాటు పలువురు పింఛను, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని ఇంకొందరు అభ్యర్థించారు.

# పాయకరావుపేట నియోజకవర్గానికి భారీ నిధులు

- నక్కపల్లిలో స్వయం పేరుతో డ్రై ఫిష్ యూనిట్
- ప్రభుత్వ ఆసుపత్రి రూ.32.80 కోట్లతో అప్‌గ్రేడ్
- రాజయ్యపేటలో బీసీ వెల్ఫేర్ హాస్టల్ ఏర్పాటు
- హెూంమంత్రి వంగలపూడి అనిత

విశాఖపట్నం(చైతన్యరథం): నక్కపల్లి క్యాంప్ కార్యాలయం వద్ద పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో హోం మంత్రి వంగలపూడి అనిత సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ నాయకులకు శుభవార్త చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ రూపురేఖలు మార్చేలా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ ప్రకటనపై పాయకరావుపేట నియోజకవర్గ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానంగా ఎస్.రాయవరం మండలం పెద్దఉప్పలం-లింగరాజుపాలెం మధ్య బ్రిడ్జ్ నిర్మాణా నికి రూ.13 కోట్లు, కోటవురట్ల మండలం ఇందేశమ్మవాక వద్ద కొండను తొలిచి రోడ్డు నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరు అయ్యాయని మంత్రి అనిత వెల్లడించారు. అలాగే నక్కపల్లి, ఎస్. రాయవరం మండలాల ప్రజల దశాబ్దాల కల నెరవేరేలా వైద్యం, విద్యా రంగాల్లో కీలక నిర్ణయాలు



తీసుకున్నామని పేర్కొన్నారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని రూ.32.80 కోట్లతో 100 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయడంతో పాటు ట్రోమా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కూడా అనుమతి లభించింద న్నారు. అలాగే పెనుగొళ్ళు ఆసుపత్రి అభివృద్ధికి మరో రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యారంగంలో భాగంగా జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. ఉపాధి అవకాశాల కోసం నక్కపల్లి మండలంలో 'స్వయం' పేరుతో డ్రై ఫిష్ యూనిట్, రాజయ్యపేటలో బీసీ వెల్ఫేర్ హాస్టల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్ విచ్చేస్తున్నారని చెప్పారు. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో గ్రామాల్లో నాయకులు సంసిద్ధంగా ఉండాలని కోరారు.

### సింహాద్రి అప్పన్న చందనోత్సవంపై సమీక్ష

సింహాచలం అప్పన్నస్వామిని హెూంమంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను హోం మంత్రికి అందజేశారు. అనంతరం చందనోత్సవం, స్వామివారి కల్యాణో త్సవం నేపథ్యంలో అధికారులు, అర్చకులతో ఏర్పాట్లపై చర్చించారు. గత సంవత్సరం చందనోత్సవానికి 1,20,000 మంది భక్తులు స్వామివారి దర్శనానికి రావడం జరిగింది. ఈ సంవత్సరం భక్తులు సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ నెలాఖరులో మంత్రుల బృందం చందనోత్సవం ఏర్పాట్లపై సమీక్షించనున్నాం. సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్యాస్ సరఫరాపై మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆర్టీజీఎస్ నుంచి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఆర్టీజీఎస్ రాష్ట్రానికి గుండె లాంటిది. సీఎం చంద్రబాబు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల వేదికగా కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు..వదంతులను నమ్మొద్దని తెలిపారు.

# పశువుల ఆరోగ్యం కోసం టీకాలు

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- గాలికుంటు నియంత్రణ పోస్టర్ ఆవిష్కరణ

బనగానపల్లె(చైతన్యరథం): క్యాంపు కార్యాలయంలో గాలికుం టు నియంత్రణ టీకాల పంపిణీ పోస్టర్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 29 వరకు వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం జరగనుంది. పశువుల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని రైతులంతా వినియోగించుకోవాలని పిలు పునిచ్చారు.

### ముస్లిం మత పెద్దలకు దుస్తులు

ప్రజలంతా మత సామరస్యంతో అన్నదమ్ములుగా కలిసి మెలిసి ఉండాలని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని బనగానపల్లె వ్యాప్తంగా ఉన్న పలు మసీదులను సందర్శించి ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలైన మౌజామ్, ఇమామ్‌లకు దుస్తులు పంపిణీ చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో పాల్గొనే ముస్లిం సోదరులకు మంత్రి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం, మత పెద్దలకు దుస్తులు పంపిణీ చేయడం గతం నుంచి ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో ఆదివారం ఏర్పాటు చేస్తున్న ఇఫ్తార్ విందుకు మంత్రి ప్రత్యేకంగా ఆహ్వానించారు.



# నవరత్నాలతో ప్రజాధనం దోచేశారు

- ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసం
- జగన్‌రెడ్డి పాపాలు ప్రజలు మోస్తున్నారు
- నేడు ప్రెస్‌మీట్లతో సోది చెబుతున్నారు
- బుద్ధిమాంద్యమని ప్రజలు నవ్వుకుంటున్నారు
- లడ్డూ కల్తీ జరిగిందని వైవీ, భూమనే ఒప్పుకున్నారు
- గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్న చరిత్ర జగన్‌రెడ్డిదే
- ఎమ్మెల్యే గల్లా మాధవి ధ్వజం

మంగళగిరి(చైతన్యరథం): ప్రజల ఆకాంక్షలతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగు తూ ప్రజల మన్ననలు అందుకుంటున్న సమయంలో జగన్‌రెడ్డి చీకటి పాలన గురించి పదేపదే మాట్లాడటం దురదృష్టకరమని ఎమ్మెల్యే గల్లా మాధవి వ్యాఖ్యానించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లా డుతూ గంటల తరబడి మీడియా ముందు వచ్చి జగన్‌రెడ్డి సోది చెపుతున్నాడని ప్రజలు వాపోతున్నారు. బుద్ధిమాంద్యంతో మాట్లాడుతున్నాడని నవ్వుకుంటున్నారు. ఐదేళ్ల చీకటి పాలన గుర్తు చేసి మానసిక క్షోభ కలిగిస్తున్నాడని ప్రజలు అనుకుంటు న్నారని తెలిపారు. జగన్ చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఒక రాజకీయ నాయకుడిగా ప్రజా సమస్యలపై ఏ రోజూ పట్టించుకోలేదని, ఐదేళ్ల అరాచకాలు తట్టుకోలేకే ప్రజ లు వైసీపీకి కేవలం 11 సీట్లు ఇచ్చారని గుర్తు చేశారు.

### "కాగ్" పదం పలకలేని వారు ప్రెస్‌మీట్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్మోహన్ రెడ్డి చేసిన అప్పుల కుప్పపై శ్వేతపత్రం విడుదల చేసిందని గుర్తు చేశారు. నవరత్నాలు పేరుతో సంక్షేమం అందించలేకపోయినా, 9 లక్షల కోట్లకు పైగా అప్పుల భారాన్ని మాత్రం వైసీపీ ప్రజలపై మోపిందని ఆమె దుయ్యబట్టారు. కేవలం స్కామ్‌లు చేయడానికే నవరత్నాలు అనే పేరుతో ప్రజలపై భారం మోపారని, ఆ పేరు తో ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో ఎవరి జేబులు నింపుకోవడానికి ఈ అప్పులు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఒక్క నెల కూడా ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వలేకపోయారు..ఒక్క పరిశ్రమను కూడా రాష్ట్రానికి తీసుకురాలేకపోయారు..యువతకు ఉద్యోగావ కాశాలు కల్పించలేకపోయారని ధ్వజమెత్తారు.

### ఐదేళ్లు దోపిడీ తప్ప ఏం చేశారు

ఐదేళ్ల పాటు దోపిడీ తప్ప ప్రజలకు ఉపయోగపడే పని ఏదీ చేయలేదని విమర్శించారు. ఒక తల్లికి ఇద్దరు పిల్లలు ఉంటే ఒకరికే అమ్మఒడి ఇచ్చి మరొక బిడ్డకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో కాగ్‌కు తెలియకుండా తీసుకు న్న అప్పులు, కార్పొరేషన్లను తాకట్టు పెట్టి చేసిన రుణాలు, కేంద్ర నిధులను మళ్లించిన అంశాలపై జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "కాగ్" అనే పదం సరిగా పలక లేని వారు ప్రెస్‌మీట్లు పెట్టి గంటల తరబడి మాట్లాడుతు న్నారని ఎద్దేవా చేశారు. కనీసం ఇరిగేషన్ శాఖ గురించి అవగాహన లేని వారిని మంత్రులుగా పెట్టి పోలవరాన్ని అటకెక్కించారని ఆక్షేపించారు. ఐదేళ్ల పాలనలో పారదర్శకత లేకపోయినా, ప్రతి శాఖలో స్కామ్‌లలో మాత్రం జగన్ ప్రభుత్వం ముందుం డిందని విమర్శించారు. కాంట్రాక్టర్లకు లక్షా ముప్పై వేల కోట్ల బకాయి లు వదిలి వెళ్లారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని చెల్లి స్తున్నదని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ప్రతి రూపాయికి పారదర్శకంగా లెక్క చెబుతోందని గుర్తు చేశారు. జగన్‌రెడ్డికి సమాధానం కావాలంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు.

### దేవదేవుడికి మహాపచారం

వైసీపీ పాలనలో ప్రతిదీ కల్తీగా మారింది. లడ్డూను కల్తీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ జరిగిందని సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి కూడా ఒప్పుకున్నారని గుర్తు చేశారు. లక్షలాది భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీశారు. ఈ విషయాలు బయటపడు తుండగా "ఎవరు మాట్లాడ కూడదు" అంటూ సుప్రీంకోర్టు మెట్లు వైసీపీ ఎక్కారని దుయ్యబట్టారు. వైసీపీ వేసిన పిటిషన్‌ను కేవలం ఒక క్రిమినల్ కేసులో నిందితుల తరఫున డిఫెన్స్‌ను బలపరుచుకోవడానికి చేసిన పనికిమాలిన ప్రయత్నం మాత్రమే అని సుప్రీంకోర్టు కూడా తిరస్కరించిందని గుర్తు చేశారు. అధికా రం కోసం సొంత బాబాయ్‌ను హత్య చేసి ఆ విషయంపై ఎవరు మాట్లాడకూడదని గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్న చరిత్ర జగన్‌రెడ్డిదని తీవ్ర



విమర్శలు చేశారు. హత్యలు, కుట్రలు, దోపిడీలు చేసి ప్రజల సొత్తును కొల్లగొట్టిందే కాకుండా ఎవరు మాట్లాడకూడదు అని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ఆమె ఆరోపించారు. తప్పు చేశారని ప్రశ్నించిన వారిపై తప్పుడు ప్రచారాలు చేస్తారని, మహిళలను సోషల్ మీడియాలో అవమానించేలా మాట్లాడి స్తారని ఆక్షేపించారు. అధికారులను బెదిరించడం, నీచ రాజకీ యాల కోసం చిన్నపిల్లలను కూడా ఉపయోగించడం వైసీపీ సంస్కృతిగా మారిందని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి నీచ రాజకీయాలు ఎప్పటికీ కొనసాగవని హెచ్చరించారు. కల్తీ నెయ్యి విషయంలో తప్పు చేయకపోతే వైసీపీ ఎందుకు భయపడుతుందో ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు.

# సమ్మర్ యాక్షన్ ప్లాన్-2026 సిద్ధం

- అవేర్ ద్వారా వేసవి తీవ్రతపై అప్రమత్తం
- జిల్లా అధికారులు, వైద్యులకు శిక్షణ కార్యక్రమాలు
- కేసుల నమోదుకు అనుగుణంగా సత్వర చర్యలు
- 1 71 కోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం
- ఉప ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీల నుంచి సన్నద్ధత
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి(చైతన్యరథం): వేసవి తీవ్రత అంచనాలకు అనుగ ుణంగా ముందస్తు చర్యలు చేపట్టినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఆధారంగా రూపొందించిన సమ్మర్ యాక్ష న్ ప్లాన్-2026’పై ఉన్నతాధికారులతో చర్చించారు. వేసవి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయడం, వడ దెబ్బకు గురైతే సదరు లక్షణాలను వెన్వెంటనే గుర్తించి సకాలంలో వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పిం చడం, ఇలాంటి కేసుల్లో చికిత్స ఎలా అందించాలన్న దానిపై వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుండడం, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షే మ శాఖ నుంచి వస్తున్న సలహాలు, సూచనలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, రాష్ట్రంలోని పరిస్థితులపై వంటి అంశాల గురించి వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్‌బాబు, ఫుడ్ సెఫ్టీ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ నీలకం ఠారెడ్డి, ఇతర అధికారులతో మంత్రి చర్చించారు. ఈ సందర్భం గా మంత్రి సత్యకుమార్ ఒక ప్రకటన జారీచేశారు.

**'అవేర్' ద్వారా ముందుగానే హెచ్చరికలు**

అవేర్ ప్లాటుఫామ్ ద్వారా రానున్న 4 నుంచి 5 రోజుల్లో వేసవి తీవ్రత ఎలా ఉంటుందన్న సమాచారం తెలుసుకునే విధంగా ఏర్పా ట్లు జరిగాయి. వాతావరణం కేంద్రాల ద్వారా అందే సమాచారం ఆధారంగా ఏ ప్రాంతాల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉందో గుర్తిస్తారు. ఈ సమాచారం జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులకు అందుబాటులో ఉంటుంది. దీనికి అనుగుణంగా వీరు చర్యలు తీసుకుంటారు. 27 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 32 డిగ్రీల సెం టిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదైతే దానిని 'హెచ్చరిక (కాషన్)'గా గుర్తిస్తున్నారు. 33 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 41 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదైతే దానిని 'అపాయం-డేంజర్'లో ఉన్న ట్లు గుర్తిస్తారు. 42 నుంచి 54 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదైతే దానిని 'మరింత అపాయం' (వెరీ డేంజర్)గా అవేర్ డిజిటల్ ప్లాట్‌ఫాంలో గుర్తిస్తారు. సీజనల్ వ్యాధులను రియల్ టైమ్‌లో పర్యవేక్షించి వ్యాధులు వ్యాప్తిచెందకుండా చర్యలు తీసు కునేందుకు ఆర్టీజీఎస్‌లోని 'అవేర్ (అడ్వాన్స్డ్ వార్నింగ్ అడ్వైయిజరీ ఫర్ రిసిలియెంట్ ఎకోసిస్టమ్) సేవలను ఇప్పటికే వైద్య, ఆరోగ్య శాఖ వినియోగించుకుంటోంది. గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలోని ఏయే జిల్లాలు, మండలాల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉందో మ్యాపింగ్ ద్వారా తెలుసుకునేలా ఏర్పాటు చేశారు. ఐహెచ్ఐపీ పోర్టల్ ద్వారా రోజువారీ డేటా సేకరణ నిర్వహిస్తూ రియల్‌టైం మానిటరింగ్ చేస్తున్నారు.

**శిక్షణ కార్యక్రమాలతో సన్నద్ధం**

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సర్వైలెన్స్ ఆఫీసర్స్, ఎపిడిమియాలజిస్టులు, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్లకు సమ్మర్ యాక్షన్ ప్లాన్-2026 గురించి వర్చువల్ విధానంలో వివరించారు. వీరి ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి తిరిగి శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు జరుగుతు న్నాయి. అలాగే కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారు లు జాతీయ స్థాయిలో భాగంగా జిల్లాల్లో ఉండే వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో వర్చువల్‌గా శిక్షణ ఇచ్చారు హీట్ స్ట్రోక్ (వడ దెబ్బ) కేసులు ఎలా గుర్తించాలి? పోర్టల్ (ఎన్‌సీసీహెచ్ఎచ్-ఐహెచ్ ఐపీ)లో ఎలా నమోదు చేయాలి, ఇతర అంశాల గురించి వివరిం చారు దీనికి అనుగుణంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు కూడా జిల్లా అధికారులకు వివరించారు.

**ముందస్తు జాగ్రత్తలు**

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వడదెబ్బకు గురైన వారికి ప్రాథమిక చికిత్స అందించేలా ఏర్పాట్లు జరిగాయి. కేసు తీవ్రత అనుసరించి ఉన్నత చికిత్స నిమిత్తం ఉన్నతస్థాయి ఆసుపత్రులకు 108 అంబులెన్సుల ద్వారా తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్) ప్యాకెట్లు 1,71,66,381) అన్ని ఆసుపత్రుల్లో సిద్ధం చేశారు. పీహెచ్సీల్లో 50,74,423, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 16,77,787 చొప్పున ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయని సత్యకుమార్ తెలిపారు. అవసరాల కు తగ్గట్లు ఐవీ ఫ్లూయిడ్స్ కూడా సిద్ధం చేసినట్లు చెప్పారు.

**సహచర శాఖలతో సమన్వయం**

గర్భిణులు, వృద్ధులు, శిశువులు, నిర్మాణ రంగం కూలీలు, గ్రానైటు, నరేగా వర్కర్స్, ట్రాఫిక్ పోలీసులు, వేసవి తీవ్రతకు ప్రభావితమయ్యే ఇతర రంగాల వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని జిల్లా అధికారులను మంత్రి ఆదేశించా రు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, కార్పొరేషన్, డిజాస్టర్ మేనేజ్మెంటు, పోలీసు, ఫైర్ అండ్ సేఫ్టీ, విద్యుత్తు, గ్రామీణ నీటిపారుదల, విద్యా శాఖ, కార్మిక, ఇతర శాఖల వారితో సమన్వయంతో వ్యవహరించి, వేసవితీవ్రతకు దూరంగా ఉండేలా ప్రజల్లో అవగాహన తేవాలని మంత్రి స్పష్టం చేశారు. వేసవి తీవ్ర తకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో జూన్ వరకు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

# సూపర్‌సిక్స్ సూపర్ ఫాస్ట్

- ఎన్నికల హామీలు 95 శాతం అమలు
- మూడు రాజధానులంటూ జగన్ మోసం
- నాసిరకం లిక్కర్‌తో వేలమంది ప్రాణాలు తీశారు
- మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి



మంగళగిరి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల్లోనే ఎన్నికల హామీల్లో దాదాపుగా 95 శాతం అమలు చేసి చరిత్ర సృష్టించామని మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సూపర్‌సిక్స్ హామీ లను సూపర్ ఫాస్ట్‌గా అమలు చేసి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చామని తెలిపారు. దేశానికి టెక్నాలజీని పరిచయం చేసి ఏపీని ప్రపంచ పటంలో నిలిపిన నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. నారా లోకేష్ ఆలోచనలో వేగంతో నేడు రాష్ట్రాని కి పెట్టుబడులు క్యూ కడుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో చాలా కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయని పేర్కొ న్నారు. ఒక్క విశాఖ సీఐఐ సమ్మిట్‌లోనే రూ.13 లక్షల కోట్లపైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన మాట ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తు న్నామని వివరించారు.

**కల్తీ మద్యంతో లక్షల మంది ఆరోగ్యం గుల్ల**

జగన్‌రెడ్డి నవరత్నాల పేరుతో నవ మోసాలు చేశాడు. మద్యం పానం నిషేధం చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే జే బ్రాండ్ లిక్కర్‌తో చాలామంది ఆరోగ్యంతో ఆటలాడాడు. ఎన్నో కుటుంబా ల్లో చీకటి నింపాడు. సుమారు 30 వేల మంది మహిళల మంగళ సూత్రాలను తెంచాడు. లక్షల మందిని ఆసుపత్రి పాలు చేశాడు. రూ.33 వేల మద్యం కుంభకోణానికి పాల్పడ్డారు. ఒక దళిత నేత నారాయణ స్వామిని ఇందులో భాగస్వామ్యం చేశాడు. నివాస యోగం లేని ప్రదేశంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి భారీ స్కామ్ చేశాడు. కూటమి ప్రభుత్వంలో 3 లక్షలు ఇచ్చాం. 5 లక్షలు ప్లాన్ చేస్తు న్నాం. అమ్మఒడి పథకం 42 లక్షల మందికే ఇచ్చి మోసం చేశాడు. నేడు కూటమి ప్రభుత్వం 67 లక్షల మందికి తల్లికి వంద నం ఇస్తున్నాం. డొక్క సీతమ్మ, ముస్తాబు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

**స్కీమ్స్‌లో ఎలా స్కామ్ చేయాలో వైసీపీకి బాగా తెలుసు**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా డ్వాక్రా మహిళల ను జగన్‌రెడ్డి మోసం చేశాడు. నేడు కూటమి ప్రభుత్వంలో రూ.5 లక్షల వరకు సున్నా వడ్డీ ఇస్తున్నాం. పింఛన్ల పేరుతో మోసం చేశాడు. ఐదేళ్లలో కేవలం రూ.1000 మాత్రమే పెంచాడు. నేడు చంద్రబాబు అధికారంలోకి రాగానే మొదటి నెలలోనే రూ.7000 ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతీ రైతు అకౌంట్ లో రూ.20 వేలు వేశాం. ఆరోగ్య శ్రీ పథకంలో జగన్ పెట్టిన సుమారు రూ.2500 వేల కోట్లు బిల్లులు చెల్లించాం. యూనిట్ విద్యుత్ ధర 13 పైసలు తగ్గించి చరిత్రలో తొలిసారిగా ట్రూ డౌన్ చేశాం. విద్యుత్ రంగంలో రూ.4500 కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లించినట్లు తెలిపారు.

**దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం**

జగన్‌రెడ్డి మడమ ఒక్కసారి తిప్పలేదు. వంకర్లుగా తిప్పి మరి జనాలను మోసం చేశాడు. కాబట్టే ప్రజలు 11 సీట్లు ఇచ్చి ఇంట్లో కూర్చొబెట్టారు. స్త్రీ శక్తి పథకంతో రోజుకు 7 లక్షల మంది మహిళ లు ప్రయాణిస్తున్నారు. ఇప్పటివరకు 43 కోట్ల మంది ప్రయాణించారు. రూ.1500 కోట్లు కేటాయించాం. దీపం 2 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. మహిళ ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ఈ పథకం తీసుకొచ్చాం. వైసీపీ హయాంలో సిలిండర్ ధర రూ.350 నుంచి రూ.1000పైనే పెరిగింది. వైసీపీ హయాంలో రైతులు దళారి చేతుల్లో ఉండేవారు. నేడు రైతు సంక్షే మాన్ని దృష్టిలో పెట్టుకుని ఏడాదికి పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తున్నాం. ఇప్పటివరకు మూడు విడతల్లో కలిపి రూ.8853 కోట్లు చెల్లించాం. ఆడబిడ్డ నిధి పథకాన్ని పీ4 పథకంలోకి తీసు కొచ్చాం. ఎన్టీఆర్ పింఛన్ల కోసం రూ.58,654 కోట్లు ఇచ్చాం. 63 లక్షల మందికి ఇస్తున్నాం. వైసీపీ చెప్పినట్లు ఏ ఒక్కరి పింఛన్ తొలగించలేదు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిం చాం. మత్స్యకార సేవలో పథకం రూ.280 కోట్లు ఇచ్చాం. 2 లక్షల మందికి వర్తింపజేశాం. నాయి బ్రాహ్మణులకు సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్ ఇచ్చాం. పవర్ లూమ్స్ వాడుతున్న వాళ్ల కు 500 ఉచిత యూనిట్లు ఇచ్చాం. ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తున్నాం. జగన్ ప్రభుత్వంలో రూ.10 వేలు మాత్రమే ఇచ్చేవా డు. ఆ డబ్బులు అప్పటి గుంతల రోడ్లతో దెబ్బతిన్న వాహనాల మరమ్మతులకు సరిపోయేవి. ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి అనేకమందికి సమ న్యాయం చేశామని తెలిపారు.

**డోలీ మోతలకు స్వస్తి**

పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు జగన్ రద్దు చేశాడు. నేడు రాష్ట్రవ్యాప్తంగా 205 అన్న క్యాంటీన్లల్లో కేవలం రూ.5లకే కడుపు నిండా భోజనం పెడుతున్నాం. ఇమామ్స్, పాస్టర్స్, పురోహి తులకు ఆర్థిక సాయం చేస్తున్నాం. అడవి తల్లి బాటతో గ్రామీణా ప్రాంతాల్లో రోడ్లు వేశాం. డోలి మోతలు నివారణ లక్ష్యంగా గిరిజ న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. సమగ్ర బీమా పాలసీ ద్వారా అందరికీ ఉచిత బీమా కల్పిస్తున్నాం. రేషన్ లబ్ధి దారులకు స్మార్ట్ కార్డులు ఇచ్చాం. అలానే రేషన్‌లో మిల్లెట్స్, కందిపప్పు కూడా ఇచ్చి ఆరోగ్య భద్రత కల్పిస్తున్నాం. అంగన్వాడీ లకు గ్రాట్యుటీ పెంచాం. సుమారు 5000 అంగన్వాడీ కార్యకర్త లను అప్ గ్రేడ్ చేశాం. ఒకటే రాజధాని అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పోలవరం పనులు సుమారు 85 శాతం పూర్తి చేశాం. ఈ ఏడాదిలో వెలిగొండ, వచ్చే ఏడాదిలో పోలవరం ప్రాజెక్టులను ప్రారంభించడానికి ప్లాన్ చేస్తు న్నాం. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు ఆధ్వర్యంలో నేడు రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని స్పష్టం చేశారు.

చైతన్యరథం

# ఉద్దానంలో తొలి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స

**కుమార్తెకు తండ్రి మూత్రపిండం దానం**

**కూటమి ప్రభుత్వం చొరవతో ఊపిరి**



అమరావతి (చైతన్యరథం): మూత్రపిండాల వ్యాధితో దినదిన గండంగా బతుకుతున్న శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రజలకు ఊర టనిచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం ఆసుపత్రిలో శుక్రవారం తొలి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. సోంపేటకు చెందిన హేమశ్రీ రెండు మూత్రపిండాలు పాడవటంతో తండ్రి మోహనరావు కిడ్నీ దానం చేశారు. ఉద్దానం పరిశోధన కేంద్రంలో శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రి సీనియర్ వైద్యుడు ఉమామహే శ్వరరావు నేతృత్వంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజులతో కూడిన వైద్యబృందం 5 గంటల పాటు ఆపరేషన్ చేశారు. బాధిత మహిళ కిడ్నీ బాగానే పని చేస్తోందని, మరో 15 రోజులు పోస్టు ఆపరేషన్ వైద్యసేవలు చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. దేశంలోనే తొలిసారి గ్రామీణ ప్రాంతమైన ఉద్దానం కిడ్నీ పరిశోధన కేంద్రం ఆసుపత్రిలో మూత్రపిండం మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతం చేసిన వైద్యుల బృందానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు.

**గాలికొదిలేసిన వైకాపా సర్కారు**

గతంలో తెదేపా ప్రభుత్వం కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఆసు పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా... పూర్తిస్థాయిలో సదుపాయాలు లేకుండానే ఎన్నికలకు ఏడాది ముందు 2023 డిసెంబరులో ఆఘమేఘాలపై ప్రారంభించింది. పలాస సామాజిక ఆసుపత్రిలోని డయాలసిస్ యంత్రాలను తెచ్చి, ఇక్కడి పెట్టి హడావుడి చేసింది. వైద్య నిపుణు ల్ని నియమించలేదు.. కూటమి ప్రభుత్వం వచ్చాక దాతల సాయం తో పరిశోధన కేంద్రంలో 10 డయాలసిస్ యంత్రాలను సమకూ ర్చింది. వైద్య పరికరాలకు రూ.3 కోట్లు, పరిశోధనలకు రూ.3 కోట్లు మంజూరు చేసింది. తాజాగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సకు శ్రీకారం చుట్టి.. ఉద్దానం వాసుల్లో భరోసా నింపింది.

# సీఎం పర్యటన వాయిదా

తడ (చైతన్యరథం): సీఎం చంద్రబాబు సూళ్లూరుపేట పర్యటన వాయిదా పడింది. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు ఈనెల 17న సీఎం రావాల్సి వుండగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. అయితే ఈ కార్యక్రమం 24వ తేదీకి వాయిదా పడినట్లు శు క్రవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రకటించారు. కాగా, ముఖ్యమంత్రి పర్యటన రద్దు కావడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. జనవరిలో జరిగిన పక్షుల పండుగ చివరిరోజు ముఖ్యమంత్రి హాజరవుతున్నట్లు ప్రచారం జరిగింది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే చివర్లో ముఖ్యమంత్రి పర్యటన రద్దయింది.

## శతాబ్ది వేళ..అభివృద్ధి పనులకు సిద్ధం

- **రూ.700 కోట్లతో ఆంధ్రా వర్సిటీలో ప్రణాళికలు**
- **జాబితాలో కీలక విభాగాల ఆధునికీకరణ**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు**
- **దాతల సహకారంతో మరికొన్ని ప్రాజెక్టులు**

విశాఖపట్నం(చైతన్యరథం): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న వేళ అధికారులు సుమారు రూ.700 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో రూ.500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి, మరో రూ.200 కోట్లు కేంద్రం నుంచి పొందేందుకు అనుగుణంగా ప్రతి పాదనలు పంపించారు. వందేళ్ల చరిత్ర కలిగిన విశ్వవిద్యాల యాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తోంది. ఈ క్రమంలోనే హెరిటేజ్ యూనివర్సిటీ ప్రోగ్రామ్ కింద యూజీసీ ద్వారా రూ.200 కోట్లు ఇవ్వాలని వర్సిటీ అధికారులు కోరారు. ఆ నిధులతో చేపట్టనున్న ప్రాజెక్టులకు సంబంధి చిన వివరాలతో ప్రతిపాదనలు విద్యా శాఖకు అందించగా, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నేరుగా కేంద్రానికి పంపించి, సహకరిం చాలని కోరినట్లు వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

వందేళ్లు జరుపుకుంటున్న వర్సిటీకి రూ.500 కోట్లు అందిం చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికారులు కోరారు. ఆ నిధులతో మెగా మెస్, హాస్టళ్లు, అకాడమిక్ కాన్ఫరెన్స్ హాల్, సాగరిక హాల్‌పై అదనంగా మరో మూడు అంతస్తులు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే, రెండు గేట్లు ఆధునికీకరణ, రజని గెస్ట్ హౌస్ రెనోవేషన్, వీసీ బంగ్లా ఆధునికీకరణ, కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఫిజిక్స్ విభాగం బిల్డింగ్ వద్ద సెంటినరీ పార్కు నిర్మాణం, అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించారు. ఇంకా సైకాలజీ విభాగం ఎదురుగా నిర్మించిన ఎలిమెంట్ బిల్డింగ్‌లో ఏర్పాటుచేసిన బయో ఫార్మా బయోటెక్ ల్యాబ్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు అనుగుణంగా సదుపాయాల కల్పన, పరికరాల కొనుగోలు, క్వాంటం టెక్నాలజీ కోర్సులకు అనుగుణంగా ల్యాబ్ ఏర్పాటు (రూ.50 కోట్లు), సెమీ కండక్టర్స్ ల్యాబ్ ఏర్పాటుకు కొందరు దాతలు ముందుకు వచ్చారు. అలాగే, ఆర్ట్స్, లా, కామర్స్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ కాంపిటెన్సీ డెవలప్‌మెంట్ సెంటర్ (రూ.5 కోట్లు) ఏర్పాటు, ల్యాబ్‌లలో అత్యాధునిక పరికరాల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు కోసం రూ.100 కోట్లు అవుతాయని అంచనాలు రూపొందించారు. సెంటినరీ సెలబ్రేషన్ కోసం రూ.25 కోట్లు అవసరమని ప్రతిపాదించారు.

# కూటమి ప్రభుత్వంలో ముస్లిం సంక్షేమం

- **మంత్రి నిమ్మల రామానాయుడు**
- **ఇఫ్తార్ విందుకు హాజరు**



పాలకొల్లు(చైతన్యరథం): పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా పాలకొల్లు పెద్ద మసీదులో ముస్లిం సోదరులకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా వారితో కలిసి ప్రార్థనల్లో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరుల తో మంత్రి ఆత్మీయంగా ముచ్చటించారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింత కలయికగా నిలుస్తుందని అన్నారు. నెల రోజులపాటు ముస్లింలు పాటించే కఠిన ఉపవాస దీక్ష గొప్ప ఆచారమని పేర్కొన్నారు. ఖురాన్ పఠనం, ప్రార్థనలు, ఇతరులకు సహాయం చేయడం ద్వారా ముస్లింలు మంచి మార్గంలో పయని స్తారని తెలిపారు. ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వెల్లడించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లిం సంక్షేమానికి రూ.6090 కోట్లు కేటా యించిందన్నారు. గతంలో వివాదాస్పదంగా మారిన జీఓ–43 ద్వారా వక్ఫ్‌బోర్డుపై వచ్చిన సమస్యలను కూటమి ప్రభుత్వం రద్దు చేసి పరిష్కరించిందని చెప్పారు. ఎన్టీఆర్ ఉమ్మడి రాష్ట్రంలో తొలిసారి ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అలాగే చంద్రబాబు ఉర్దూను రెండో భాషగా గుర్తింపు ఇచ్చారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇమాములు, మౌజాన్లకు రూ.90కోట్ల గౌరవ వేతనాలు అందజేస్తున్నామని చెప్పారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నా మని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇఫ్తార్ విందుల కోసం రూ.1.50 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పెచ్చెట్టి బాబు, జీవి, ధనాని సూర్యప్రకాష్ అల్లం తాతాజీ, పొట్నూరి శ్రీనివాస్, వల్లభ శ్రీనివాస్, ముప్పిరి సత్యనా రాయణ, మహమ్మద్ జానీ, బిరుదుకోట సోమశేఖర్ మల్లంపల్లి పకీర్ బాబు, జగ్గోతు రాంబాబు, బీజేపీ నాయకులు ఉన్నమట్ల కపర్తి, కొల్లి కొండప్రసాద్, కోడి విజయభాస్కర్, విన్నకోట గోపి, పాముల రజిని, గాది చిన్న వెంకన్న, పాలవలసరావు, మామిడి శెట్టి పెద్దిరా జు, దాసరి రతనరాజు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటే చంద్రబాబే

- **మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి**
- **జగన్ మెప్పు కోసమే సీదిరి అప్పలరాజు దుష్ప్రచారం చేస్తున్నారు**
- **ఏపీ ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్**



అమరావతి (చైతన్యరథం): 'జగన్ మెప్పు పొందడం కోసం మత్స్యకారుల సంక్షేమాన్ని అడ్డుకునేందుకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దుష్ప్రచారం చేస్తున్నాడు... పీపీపీ విధానంలో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వేగంగా అభివృద్ధి చెంది, మత్స్యకారులకు భరోసాగా నిలుస్తుంది' అని ఏపీ ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాజీ మంత్రి అప్పలరాజు వ్యాఖ్యలపై మండిపడ్డారు.

"అభివృద్ధి అంటే చంద్రబాబు... చంద్రబాబు అంటే అభివృద్ధి. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల ప్రభుత్వం. వారి సంక్షేమం కోసం ఏమీ చేయని మత్స్య శాఖ మాజీ మంత్రి నేడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పదం. నేను మత్స్యకార వర్గానికి చెందిన వాడినని చెప్పుకునే అప్పలరాజు మంత్రిగా వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యకారుల కోసం ఏమి చేశారో ప్రజల ముందుకు వచ్చి చెప్పాలి. జగన్ రెడ్డి మెప్పు కోసం, మంత్రి పదవిని కాపాడుకోవడం కోసం ఐదేళ్ల పాటు మత్స్యకారులను తాకట్టుపెట్టిన వ్యక్తి" అని దుయ్యబట్టారు.

**జీవో నెం.217 రద్దు చేసి మత్స్యకారులకు అండగా నిలిచాం**

"వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.217 మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసింది. దానివల్ల కలిగే నష్టాలను కొల్లు రవీంద్ర గుర్తించి ప్రతిపక్షంలో ఉన్నప్పుడే కమిటీ ఏర్పాటుచేసి మత్స్యకారులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించారు. దానికి చంద్రబాబు మద్దతు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన వెంటనే జీవో నెం.217 రద్దు చేసింది" అని తెలిపారు.

**మత్స్యకారుల సంక్షేమానికి వైసీపీ గుదిబండ**

"వేట సమయంలో మత్స్యకారులు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భాల్లో కనీస నష్టపరిహారం ఇవ్వడంలో కూడా వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. జగన్ ప్రభుత్వం ఇవ్వని కుటుంబాలతో కలిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం 95 కుటుంబాలకు మేమే నష్టపరిహారం చెల్లించాం. వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు పేరుతో మత్స్యకారు లకు సంక్షేమం ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంది. కానీ వాస్తవానికి వారికి రావాల్సిన అనేక పథకాలను అందకుండా చేసింది. వైసీపీ పాలనలో ఒక్క మత్స్యకారుడికి కూడా వలలు, బోట్లు, ఐస్ బాక్సులు, పనిముట్లు ఇవ్వలేదు. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం మత్స్యకారుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. వలలు, ఐస్ బాక్సులు, పనిముట్లు, బూట్లు, త్రీవీలర్ వాహనాలు, జెట్టీలు, మహిళా సంఘాలకు నిధులు వంటి అనేక పథకాలు అమలు చేసింది" అని తెలిపారు.

**ఫిష్ ఆంధ్ర పేరుతో వైసీపీ భారీ స్కామ్**

"జగన్ రెడ్డి ప్రభుత్వం 'ఫిష్ ఆంధ్ర' పేరుతో ప్రభుత్వ నిధులను దారి మళ్లించి వృథా చేసింది. మాకొద్దని మొరపెట్టుకున్నా ఒత్తిడి చేసి, బెదిరించి ఫిష్ ఆంధ్ర స్టాల్‌లను వారిపై బలవంతంగా మోపారు. నిధుల దుర్వినియోగాన్ని మేము ప్రజలకు తెలియజేస్తాం.

ప్రతి అంశాన్నీ వెలికితీస్తాం. మత్స్యకారుల తరపున పోరాడిన కొల్లు రవీంద్రను 54 రోజులు జైలులో పెట్టి వేధించింది జగన్ రెడ్డి ప్రభుత్వం. ఆ సమయంలో నోరు విప్పని సీదిరి అప్పలరాజు నేడు గుర్తింపు కోసం మాట్లాడుతున్నారు. సోంపేటలో నలుగురు మత్స్యకారుల హత్యకు గురైనప్పుడు, గన్నవరంలో ఒక మత్స్యకారిణిని కాల్చి చంపినప్పుడు కూడా ఆయన స్పందించలేదు. కానీ ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం మాట్లాడుతున్నారు" అని మండిపడ్డారు.

**పీపీపీ విధానం భేష్**

'జువ్వలదిన్నె హార్బర్ విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. పీపీపీ విధానంలో హార్బర్ వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇది పూర్తయితే మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ తరపున రాష్ట్రవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు కేంద్ర పథకాలను జోడించి మత్స్యకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తా'మని అని రాంప్రసాద్ చెప్పారు.

# పేదల పాలిట సీంఎఆర్‌ఎఫ్ ఓ వరం

- సాలూరులో చెక్కు అందజేసిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సాలూరు (చైతన్యరథం): సీఎం సహాయనిధి పేదలకు వరమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. సాలూరులో నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు రూ.15,114 విలువైన చెక్కును పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి రాష్ట్రంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఏలూరులో గ్యాస్ సిలిండర్ చోరీ... ట్రెండ్ మార్చిన దొంగలు

- సిలిండర్లు దొరకవనే ఆందోళనతో గ్యాస్ ఏజెన్సీలకు క్యూ కడుతున్న ప్రజలు... వదంతులు నమ్మొద్దని ప్రభుత్వం సూచన

దొంగలు కూడా ట్రెండు మారుస్తున్నారు.. నిన్నామొన్నటి దాకా బంగారం. వెండిపై కన్నేసిన దొంగలు.. ఇప్పుడు గ్యాస్ బండపై కన్నేస్తున్నారు. గ్యాస్ సిలిండర్లు దొంగిలిస్తున్నారు. మన పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడులో ఇప్పటికే ఇలాంటి చోరీలు జరగ్గా.. తాజాగా ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలోనే గ్యాస్ సిలిండర్ చోరీ జరిగింది. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో ఓ ఇంటి ఆవరణలోకి రాత్రి సమయంలో ప్రవేశించిన దొంగలు.. కాంపౌండ్‌లో పెట్టిన గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్లిపోయారు. ఇంట్లోని వ్యక్తులు ఇంటికి తాళం వేసి పనిమీద బయటకు వెళ్లారు. అయితే ఇంటి కాంపౌండ్ లోపల గ్యాస్ సిలిండర్ అలాగే ఉండిపోయింది. ఈ విషయాన్ని గుర్తించిన దొంగలు.. గ్యాస్ సిలిండర్ చోరీ చేశారు.

గ్యాస్ సిలిండర్లకు ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉందో తెలిసిన సంగతే. ప్రభుత్వాలు ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని చెప్తున్నప్పటికీ.. గ్యాస్ సిలిండర్ బుకింగ్ జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ బుకింగ్ కోసం ఫోన్ చేస్తే లైన్ కలవకపోవటం, కలిసినా గ్యాస్ బుక్ కాకపోవటం, ఓటీపీ రాకపోవటం వంటి సమస్యలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొంతమంది గ్యాస్ ఏజెన్సీల ముందు క్యూ కడుతున్నారు. మరికొందరు మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అయితే వినియోగదారులు ఆందోళనకు గురికావద్దని అధికారులు కోరుతున్నారు. గ్యాస్ సిలిండర్లు దొరకవనే ఆందోళనతో ఎక్కువ మంది వినియోగదారులు ఒకేసారి బుకింగ్ చేస్తూ ఉండటంతో సర్వర్ బిజీగా ఉంటోందన్నారు. ఫలితంగానే బుకింగ్‌కు సంబంధించిన సందేశాలు రావడం లేదని చెప్తున్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ జరిగి 25 రోజులు పూర్తైతే.. ఏజెన్సీల వద్దకు వెళ్లే ఆన్‌లైన్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చని సూచిస్తున్నారు.

మరోవైపు ప్రభుత్వం కూడా గృహావసరాలకు సరిపడా ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయని.. పానిక్ బుకింగ్ చేయవద్దని కోరుతోంది. ఈ క్రమంలోనే కొంతమంది అక్రమార్కులు గ్యాస్ సిలిండర్లు అక్రమంగా నిల్వచేస్తూ బ్లాక్ మార్కెట్‌కు తరలించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పుడు ఇలా గ్యాస్ సిలిండర్ల దొంగతనాలు కూడా మొదలవ్వడం ఆందోళనకరంగా మారింది. మరోవైపు వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా కొన్ని చోట్ల ఇప్పటికే హోటల్స్ మూసివేస్తున్నారు. మరికొన్ని చోట్ల టిఫిన్ రేట్లు పెంచారు. ఇంకొందరు కట్టెలపొయ్యి వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచిస్తున్నారు. మొత్తంగా ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం సగటు మధ్యతరగతి జీవిపై ప్రభావం చూపుతోంది.

# అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం

- ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- పిలుపునిచ్చిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి




నరసన్నపేట (చైతన్యరథం): నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" పథకం కింద రైతులకు నిధుల విడుదల కార్యక్రమాన్ని నరసన్నపేట మార్కెట్ కమిటీ యార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ముఖ్య అతిథిగా హాజరై రైతుల ఖాతాల్లో నిధుల విడుదలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ... రైతుల సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులు ఆర్థికంగా బలపడేలా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. పీఎం కిసాన్ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమ అవుతుందని, ఇది రైతుల వ్యవసాయ ఖర్చులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది అని, రైతు బలపడితేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రతి అర్హత కలిగిన రైతు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నరసన్నపేట నియోజకవర్గంలోని రైతుల సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వ్యవసాయరంగ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటూ రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పిఏసిఎస్ చైర్మన్లు, వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, నీటి సంఘాల అధ్యక్షులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2400 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ




పామర్రు (చైతన్యరథం): విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పామర్రు, పెడన నియోజకవర్గాల్లోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా మొత్తం 2400 మంది విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు చదువులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతిభా కోచింగ్ సెంటర్ అధినేత జంపాన సుధాకర్ తన సహకారం అందించారు. కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ , కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మరియు రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు విద్యార్థులకు స్వయంగా విద్యా సామగ్రిని అందజేసి, చదువులో కష్టపడి మంచి భవిష్యత్తు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు విద్యా సహాయం అందించడం ఎంతో అవసరమని, అలాంటి సేవా కార్యక్రమాలను ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ నిరంతరం నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్య ద్వారా విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు నిర్వాహకులు వీరంకి వెంకట గురుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు విద్యా కమిటీ చైర్మన్‌లు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు.

# యువత మత్తుపదార్థాలకు బానిక కావద్దు



ఆమదాలవలస (చైతన్యరథం): గంజాయి సేవించి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆమదాలవలస సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. శనివారం ఉదయం ఆమదాలవలస పట్టణంలోని మెట్టెక్కివలస ప్రాంతంలో ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డాగ్స్ స్క్వాడ్ను వినియోగించి పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాలకు బానిసై యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ఆమదాలవలస ఎస్సై బాలరాజుతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉగాది కానుకగా మరో జాబ్ క్యాలెండర్

- ఎన్నికల హామీని నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్సీ బుద్ధా నాగజగదీశ్వరరావు



విశాఖపట్నం (చైతన్యరథం): నిరుద్యోగ యువతీ, యువకులకు కూటమి ప్రభుత్వం ఉగాదికి మరో జాబ్ క్యాలెండర్‌తో పదివేల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చే విధంగా ప్రభుత్వంలో 60 విభాగాల్లో ఉన్న పోస్టులకు భర్తీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్చిన హామీ ప్రకారం 6,28,347 ఉద్యోగాలు కల్పించారని తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు తెలిపారు. శనివారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఉద్యోగాలు 30,607 డీఎస్సీ, కానిస్టేబుల్ నియామకాలు పూర్తి చేశారని, ఎంఎస్ఎంఈల నుండి ఉపాధి 2,48,906 పొందారని, జాబ్ ఫెయిర్, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 1,46,627 మందికి పరిశ్రమ రంగాల నుండి 95,174 ఫుడ్ ప్రాసెసింగ్ నుండి 64,035 ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్ 13,866, పర్యాటక రంగం నుండి 5,028 నుండి ఉద్యోగ అవకాశాలు కల్పించారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువతికి 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు వెళుతుంటే వైసీపీ అధినేత ప్రతిపక్ష పార్టీ నాయకుడు జగన్‌రెడ్డి పరిశ్రమలు రాకుండా కోర్టుల్లో తన అనుచరుల చేత కేసులు వేయిస్తూ పారిశ్రామికవేత్తలను బెదిరిస్తూ, ప్రపంచ బ్యాంకు ఇతర సంస్థలకు అప్పులు ఇవ్వద్దని మెయిల్స్ చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని నాగ జగదీష్ మండిపడ్డారు. జగన్‌రెడ్డి వారి గ్యాంగ్ వారానికి ఒకసారి మీడియా సమావేశం పెట్టి సూపర్ సిక్స్ పథకాలు అమలు కాలేదని, ప్రజలను మోసం చేస్తున్నారని, అబద్ధపు ప్రచారాలు చేయడం జగన్‌రెడ్డికే చెల్లిందని, మరోపక్క అన్యమతస్తులు పవన్ కళ్యాణ్‌పై సనాతన ధర్మం గురించి మాట్లాడితే ముక్కలు ముక్కలుగా నరుకుతామని హెచ్చరికలు చేస్తున్నారని, హింసను ప్రేరేపిస్తున్న ఇటువంటి వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని నాగ జగదీష్ ప్రభుత్వాన్ని కోరారు.

# రైల్వే పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

●పప్పుల మిల్లు వద్ద ప్రజలకు ఇబ్బందులు లేకుండా రైల్వే వంతెన నిర్మాణం

●విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ , ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు స్పష్టం



విజయవాడ (చైతన్యరథం): సెంట్రల్ నియోజకర్గంలో గత ప్రభుత్వం పట్టించుకోని రైల్వే పెండింగ్ ప్రాజెక్టులన్నీ త్వరితగతిన పూర్తి చేసి చూపుతామని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. 1వ డివిజన్ మధురానగర్ పప్పుల మిల్లు సెంటర్లోని రైల్వే గేటు ప్రాంతాన్ని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు రైల్వే, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆర్‌యుబి, ఆర్‌ఓబి నిర్మాణ విషయమై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) మాట్లాడుతూ... 2019- 24 మధ్యకాలంలో విజయవాడ నగర అభివృద్ధి అటకెక్కిందన్నారు. నాటి పాలకులు దోచుకోవడమే తప్ప అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా నేను, ఎమ్మెల్యేగా బోండా ఉమామహేశ్వరరావు గెలిచిన తర్వాత సెంట్రల్ నియోజకవర్గంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించామని ఎంపీ శివనాథ్ తెలిపారు. గుణదలలో ఎల్ సి గేట్ నంబర్ 8, 316 పెండింగ్ ప్రాజెక్టులు మంజూరుకు చర్యలు తీసుకున్నామని, అదేవిధంగా వాంబే కాలనీ - మధురానగర్ మధ్య ఆర్ యు బి మంజూరు చేయించామన్నారు. కొత్త రాజరాజేశ్వరి పేట- పాత రాజరాజేశ్వరి పేట మధ్య రైల్వే వంతెన నిర్మాణం, మధురానగర్ పప్పుల మిల్లు రైల్వే గేటువద్ద ప్రజలెవ్వరికీ ఇబ్బంది లేకుండా ఆర్ యుబి లేదంటే ఆర్‌ఓబి నిర్మాణం జరిగేలా చూస్తున్నామన్నారు. అందుకు సాధ్యాసాధ్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులతో కలిసి వచ్చినట్లు తెలిపారు. గుణదల ప్రాంత అభివృద్ధిని ఆ ప్రాంతంలో నాయకులని చెప్పుకునే వాళ్ళు పట్టించుకోలేదన్నారు. పేరుకే గొప్పలు చెప్పుకుంటూ గుణదల ప్రాంత అభివృద్ధికి తట్టెడు మట్టి కూడా వేయని కొందరు నాయకులు అక్కడ ఉన్నారన్నారు. ఎమ్మెల్యే బోండా ఉమా సారథ్యంలోనే నియోజకవర్గ పరిధిలోని గుణదల ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. 2029 ఎన్నికలు నాటికి నియోజకవర్గంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులన్ని పూర్తిచేసేలా చూస్తామని, గత ప్రభుత్వ చేతకానితనాన్ని, కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలకు చూపిస్తామన్నారు.

**ప్రభుత్వ విప్, సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ...**2024లో ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి సెంట్రల్ నియోజవర్గ అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. ప్రధానంగా గత పాలకులు పట్టించుకోకుండా వదిలేసిన పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. 2009లో గుణదల ఆర్‌ఓబి పనులు నాటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రారంభమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు నాడు అందిన కాడికి దోచుకున్నారన్నారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల దెబ్బకు ఆరఓబి నిర్మాణ కాంట్రాక్టర్ సైతం పారిపోయాడన్నారు. 2014 టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కాంట్రాక్టర్ కోర్టులో కేసు వేయడంతో గుణదల ఆరఓబి నిర్మాణ విషయాన్ని నాడు పట్టించుకోవడం సాధ్యపడలేదన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్సీపీ కోర్టుపరమైన ఇబ్బందులు తొలగిపోయినప్పటికీ గుణదల ఆరఓబి నిర్మాణం విషయాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టాణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి : మంత్రి కందుల దుర్గేశ్



నిడదవోలు (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. పట్టణంలో రూ.90.41 లక్షల నిధులతో 6, 13, 16, 23వ వార్డుల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ... పట్టణాన్ని ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం కారణంగా ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలుతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మైనారిటీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

●రాజమహేంద్రవరం జాంపేటలో ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ముస్లిం మైనారిటీల అభివృద్ధి కేవలం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జాంపేటలోని లబాబిన్ లైన్ మసీదు, తాజ్ హోటల్ వద్ద భవానీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీలు, అలాగే పార్టీ కేడర్‌కు శనివారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరిగిన ముస్లింల మతపరమైన ప్రార్ధనల్లో పాల్గొని అల్ సమి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లా తదితర ముస్లిం మైనారిటీ పెద్దలతో కలిసి ఇఫ్తార్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని మతాలను ఏకం చేసేదే ఈ పవిత్రమైన ఇఫ్తార్ విందు అని అన్నారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసం, ప్రార్ధనలు మనల్ని ఆత్మవిశ్వాసం, కరుణ, సోదరత్వం వైపు నడిపిస్తాయన్నారు. రంజాన్ మనకు బోధించే సత్యం ఏమిటంటే... మనం అందరూ ఒకే దేవుని సృష్టులం, భగవంతుని మార్గంలో ఐక్యంగా నడవాలని సూచిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఈ సోదరత్వాన్ని పెంచుతోందని, మతం, కులం, మతపరమైన విభేదాలను మరచి, పేదలు, రైతులు, యువత, మహిళల అభివృద్ధికి కృషి చేస్తుస్తోందన్నారు. ఈ రంజాన్ రాష్ట్రంలో శాంతి, సమృద్ధి, ఐక్యతను తీసుకువస్తుందని నమ్ముతున్నామన్నారు. తన సోదరులైన ముస్లిం మైనారిటీలంతా ఆరోగ్యం, సుఖశాంతులతో జీవించాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కాగా నగరంలోని పలు మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్టు తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

●అమలాపురంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



అమలాపురం (చైతన్యరథం): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వ్యాఖ్యానించారు. శనివారం అమలాపురం పట్టణంలోని నల్లవంతెన సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే ఆనందరావు ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి స్వయంగా భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టి, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందేలా కఠిన చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. "లోకేష్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయి. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ పాటిస్తూ, పరిశుభ్రమైన వాతావరణంలో వండి వడ్డించాలి. విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు, వారికి ఏ చిన్న ఇబ్బంది కలిగినా సహించేది లేదు" అని ఎమ్మెల్యే ఆనందరావు అధికారులను హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు సరదాగా గడిపి వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంటా రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు మరియు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు (చైతన్యరథం): కొవ్వూరు టౌన్‌లో 15వ ఆర్థిక సంఘం నుంచి మంజూరైన రూ.29 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్లను నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని గుంతుల మయం చేసిందని, దోచుకోవడమే లక్ష్యంగా సాగిన వైసీపీ పాలనలో ఏనాడు రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా సీఎం చంద్రబాబునాయుడు రోడ్లను పెద్దఎత్తున అభివృద్ధి చేస్తున్నారని, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వచ్చిందన్నారు. జగన్ పాలనలో ఏనాడు రోడ్లపై తట్ట మట్టి వేయలేదని, వైసీపీ పాలనలో రోడ్లు దారుణంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివశక్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



హైదరాబాద్ / వినుకొండ (చైతన్యరథం): పేదలకు సాయం చేయడం, జన్మభూమి రుణం తీర్చుకోవడమే లక్ష్యంగా నిస్వార్థంగా సేవలందిస్తున్న శివశక్తి ఫౌండే లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి కొనియాడారు. హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో 29వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివశక్తి ఫౌండేషన్ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి ఏటా స్టేట్ లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలవడం, ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీ కంటి ఆపరేషన్లు, పేద విద్యార్థులకు స్కాలర్షిప్లతో పాటు ఎంతోమంది పేదలకు బాసటగా నిలుస్తున్న శివశక్తి ఫౌండేషన్ ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి చేతుల మీదుగా శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి అవార్డు అందుకున్నారు. లీలావతిని నారా భువనేశ్వరి మెమోటో, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.

# వినుకొండలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండ (చైతన్యరథం): పట్టణంలోని పలు వార్డుల్లో సుమారు 55 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనును ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శనివారం ప్రారంభించారు. 30వ వార్డులో (హనుమాన్ నగర్ జీరో లైన్) రూ.30 లక్షలతో నిర్మించిన సి.సి. రోడ్డు మరియు డ్రైన్, 15వ వార్డు (శాలివాహన 2వ లైన్) రూ.15 లక్షలతో నిర్మించిన సి.సి. డ్రైన్, 16వ వార్డు (నవాజ్ కుంట) రూ.10 లక్షలతో నిర్మించిన సి.సి. రోడ్డు. అనంతరం, తిమ్మాయపాలెం రోడ్డులోని ఈద్గా వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ సంతోషంగా జరుపుకోవాలి

**♦విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్**



విజయవాడ (చైతన్యరథం): ప్రతి ముస్లిం కుటుంబం పవిత్ర రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 48వ డివిజన్లోని చిట్టినగర్ ఈద్గా ప్రాంగణంలో అమ్మ సేవ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆర్ మాధవ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పేద ముస్లిం కుటుంబాల వారికి రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్... రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్ర మాసం అన్నారు. రంజాన్ మాసంలో పేద ముస్లిం కుటుంబాలు సైతం సంతోషంగా పండగ జరుపుకునేందుకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన ట్రస్ట్ నిర్వాహకుడు మాధవ్ ను ఎంపీ అభినందించారు. విజయవాడ నగరంలో రంజాన్, క్రిస్మస్, దసరా ఏ పండుగ నైనా అన్ని కులాల వారు కులమతాలకు అతీతంగా జరుపుకుంటారని, ఇదే విజయవాడ విశిష్టత అన్నారు. ఇటువంటి విజయవాడ నగరంలో జన్మించటం, పార్లమెంటు సభ్యులు కావటం తనకెంతో గర్వంగా ఉందని శివనాథ్ అన్నారు. ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# దివ్యాంగుడికి బ్యాటరీ సైకిల్ అందించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజాదర్బార్' కార్యక్రమంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన ఒక దివ్యాంగుడి వద్దకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి అతని సమస్యను ఆప్యాయంగా అడిగి తెలుసుకుని అర్జీని స్వీకరించారు. అర్జీదారుడు తనకు జీవనోపాధి మరియు దైనందిన అవసరాలకు ఉపయోగపడే విధంగా బ్యాటరీ సైకిల్ అందించాలని కోరగా, ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే బ్యాటరీ సైకిల్ తెప్పించి అందజేస్తానని హామీ ఇచ్చారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అవసరమైన వారికి సహాయం అందేలా తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్

**♦నియోజకవర్గ ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటిపుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): అధిక వడ్డీల ఆశ చూపడంతో పాటు.. తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తానని తెలివిగా నమ్మించి తమ కష్టార్జితాన్ని దోచుకున్న వ్యక్తిపై పలు గ్రామాల ప్రజలు శనివారం మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటికి ఫిర్యాదు చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించిన సమయంలో ఎమ్మెల్యేను కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. చిలకలూరిపేట మండలం గొట్టిపాడుకు చెందిన నాగళ్ల వెంకట్రావు అనే వ్యక్తి.. రూ.10 వేలు మొదలు ఆ పైన మొత్తాలకి తగినంత ఇస్తే, ఆ మొత్తాన్ని తెలిసిన సంస్థల్లో పెట్టుబడులు రూపంలోకి మార్చి, ఎక్కువ లాభాలు అందిస్తానని నమ్మబలికి, అందినకాడికి దండుకొని ఇప్పుడు ముఖం చాటేశాడని ప్రజలు ఎమ్మెల్యే ప్రత్తిపాటికి మొరపెట్టుకున్నారు. తమకు జరిగిన మోసాన్ని ఇప్పటికే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి తెలియచేశామని, వారు విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారని, తమకు జరిగిన మోసాన్ని గుర్తించి, సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడి తమకు న్యాయం జరిగేలా చూడాలని చిలకలూరిపేట మండలం గొట్టిపాడు, మిట్టపాలెం, దండమూడి, ఈపూరివారిపాలెం, అవిశాయపాలెం గ్రామస్తులు స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు ఫిర్యాదు చేశారు.

గ్రామస్తుల విజ్ఞప్తిపై స్పందించిన ప్రత్తిపాటి పోలీస్ అధికారులతో మాట్లాడి, మోసపోయిన వారికి న్యాయం చేయాలని, పేద, మధ్యతరగతి ప్రజల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని ఆదేశించారు. బాధితులు ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందున, అధైర్య పడాల్సిన పనిలేదని ప్రత్తిపాటి తెలిపారు. జిల్లా ఎస్పీ నేతృత్వంలో చిలకలూరిపేట పోలీస్ వారు ఫిర్యాదుపై సమగ్ర దర్యాప్తు జరిపి, మీకు తగిన న్యాయం చేస్తారని ప్రత్తిపాటి బాధితులకు భరోసా ఇచ్చారు.

**త్వరలోనే అర్హులకు కొత్త పింఛన్లు**

సామాజిక పింఛన్లు పొందే అర్హులకు ప్రభుత్వం త్వరలోనే శుభవార్త చెబుతుందని, అర్హులైన వారికి తప్పకుండా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందుతాయని ప్రత్తిపాటి చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పింఛన్లు కావాలని పలు అర్జీలు తన దృష్టికి రావడంపై స్పందించారు. ఇప్పటికే ప్రభుత్వం అర్హులైన వితంతువులకు కొత్త పింఛన్లు అందిస్తోందని, అలానే వికలాంగులకు న్యాయం చేసిందన్నారు. వృద్ధులకు కూడా త్వరలోనే న్యాయం చేస్తుందని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరస్పర సహకారమే రంజాన్ : ఎమ్మెల్యే నసీర్

**♦ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు**

**♦హాజరైన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు, ఇతర నాయకులు**



గుంటూరు (చైతన్యరథం): దయాగుణానికి ప్రతీక రంజాన్ పండుగ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో గుంటూరులోని పొన్నూరు రోడ్ లో బీ కన్వెన్షన్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళ మాధవి, గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కూటమి కార్పొరేటర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు కన్నులవిందుగా సాగిందన్నారు. పవిత్ర రంజాన్ మాసం ఆత్మపరిశీలనకు, ఉపవాస దీక్ష ద్వారా ఆత్మశుద్ధికి, పరస్పర సహకారానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రంజాన్ మాసం మనిషిలో సహనం, దాతృత్వం, సోదరభావం పెంపొందించే పవిత్ర సమయం అని చెప్పారు. ముస్లిం సోదరులకు స్వయంగా ఇఫ్తార్ విందును వడ్డించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు., సమాజంలో సామరస్యాన్ని, పరస్పర గౌరవాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

# వంట గ్యాస్ కొరత లేదు : ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత లేదని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) స్పష్టం చేశారు. విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... గ్యాస్ సిలిండర్ల విషయంలో వినియోగదారులెవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి గ్యాస్ సిలిండర్లను బ్లాక్ లో విక్రయించాలని చూస్తే చర్యలు తప్పవన్నారు. కొరత పేరుతో ఎవరైనా బ్లాక్ మార్కెట్లో గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ విషయాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేనివిధంగా ఇరాన్ నుంచి స్సూయిజ్ కెనాల్ ద్వారా గ్యాస్ లోడు భారత్‌కు వస్తోందన్నారు. దేశంలో గృహ వినియోగానికి ఎక్కడా కూడా గ్యాస్ కొరత తలెత్తదన్నారు. ప్రత్యేకించి ఎన్టీఆర్ జిల్లాలో ఐఓసీ, బీపీసీఎల్ తదితర గ్యాస్ పంపిణీ సంస్థల పనితీరును నిరంతరం పరిశీలిస్తున్నామని, ఆయా సంస్థల్లో ఎన్నెన్ని గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉంటున్నాయో పరిశీలించి ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పంపిణీ చేస్తాం అని స్పష్టం చేశారు. గ్యాస్ కొరత వదంతులను ఎవరూ నమ్మి భయపడవద్దు అన్నారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లోనూ ఇబ్బందులు లేకుండా చూస్తాం అని ఎంపీ శివనాథ్ తెలిపారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణలో పాల్గొనండి

అమరావతి (చైతన్యరథం): అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా, అమరావతిలోని శాఖమూరు పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన 58 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజుని ఆహ్వానించారు కమిటీ సభ్యులు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా, తుళ్లూరు – పెద్దపరిమి రోడ్డులోని శాఖమూరు పార్కులో ఈ భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మార్చి 16వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే ఈ ఆవిష్కరణ మహోత్సవానికి ఆహ్వానించారు.

# ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

## టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు



కోవూరు (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కోవూరు పంచాతీలోని ప్రతి వార్డు సందర్శిస్తానని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నాయకులతో కలిసి కోవూరు పంచాతీలోని 1, 2 వార్డుల సందర్శన సందర్భంగా ఆమె ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా జరిగే అభివృద్ధి పనుల వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా వివిధ ప్రజావసరాలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ శాంతి నగర్‌లో జల్ జీవన్ మిషన్ లో భాగంగా 1 కోటి 48 లక్షలతో వాటర్ ట్యాంక్, పైప్ లైన్ నిర్మాణ పనులు కూడా దాదాపు పూర్తయ్యాయని త్వరలోనే ప్రారంభోత్సవం చేస్తామన్నారు. అలాగే 1, 2 వార్డులలో కొత్తగా వేస్తున్న వాటర్ పైప్ లైన్స్ కోసం రోడ్లు తవ్వేసిన కారణంగా స్థానికులు యిబ్బంది పడుతున్నారని పనులు పూర్తి చేసి ప్రజల రాకపోకలకు వున్న అడ్డకుంలు తొలగించాలని ఆమె అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులు ప్రజావసరాల గుర్తించి ప్రజలతో మమేకమై పని చేయాలని సూచించారు. అధికారులు సైతం ప్రజా సమస్యల పరిష్కార విషయంలో నిర్లక్ష్యం చూపవద్దని అవినీతి తావివ్వకుండా పనిచేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారితనం వుండాలని అధికారులు, నాయకులు సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, రూరల్ వాటర్ వర్క్స్ విద్యుత్ శాఖా అధికారులతో పాటు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కోవూరు టీడీపీ, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజా దర్బార్‌తో సామాన్యుడికి భరోసా

## పులివెందుల టీడీపీ ఇన్చార్జి బీటెక్ రవి

పులివెందుల(చైతన్యరథం): పులివెందుల టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి, నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకోవడం జరిగింది. వారు అందించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, ఆయా సమస్యల సత్వర పరిష్కారానికై సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశాను.ప్రజల సమస్యలను శ్రద్ధగా విని,వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తామని తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

## కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన



మార్కాపురం (చైతన్యరథం): గిద్దలూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ రాజాబాబు, గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ఔషధాల అందుబాటు వంటి అంశాలను సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సేవలను, మిషనరీ విధానంను క్షుణ్ణంగా పరిశీలించారు. రక్త పరీక్షలు నిర్వహించే కేంద్రాన్ని అత్యాధునిక టెక్నాలజీ ద్వారా రక్త పరీక్షలు నిర్వహించే పరికరాలను నూతన బిల్డింగు నిర్మాణ పనులు, పూర్తి చేయాలని ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలి అని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సిబ్బందితో మాట్లాడి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచనలు ఇచ్చారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను వెంటనే గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గారు తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలిపారు.

# మధ్యాహ్నం భోజనం తనిఖీ

## పాల్గొన్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

నగరి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు ప్రకారం వడమాలపేట మండలం ఓబిఆర్ కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం చేశారు. భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



# ఇచ్చిన మాట ప్రకారం పనులు పూర్తి చేశాం

## నెల్లూరు రూరల్ టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్, శ్రామిక నగర్‌లో 20 లక్షల రూపాయలతో జరుగుతున్న బీ.టీ. రోడ్డు పనులను కార్పొరేషన్ అధికారులు కూటమి నాయకులతో కలసి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 30వ డివిజన్ అభివృద్ధికి 9 కోట్ల 4 లక్షల రూపాయల నిధులు కేటాయించామన్నారు. స్థానిక ప్రజల సూచనలు, అభ్యర్థన మేరకే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రోజు చెప్పిన మాట ప్రకారం 60 రోజుల్లో 240 పనులు పూర్తి చేసి, ఈ నెల 22వ తేదీన కూటమి నాయకుల సమక్షంలో ప్రజలచేతే ప్రారంభోత్సవాలు చేయిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సారథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నెల్లూరు రూరల్ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ, నెల్లూరు పార్లమెంటరీ అధ్యక్షులు బీద రవిచంద్రకు నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ మన్నేపల్లి రఘు, కో క్లస్టర్ ఇంచార్జ్ పల్నాటి మస్తాన్ నాయుడు, 30వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు అత్తివరపు యానదయ్య, 31వ డివిజన్ అధ్యక్షుడు కూకటి హరిబాబు యాదవ్, 31వ డివిజన్ టీడీపీ నాయకులు బత్తల కృష్ణ, టిడిపి నాయకులు ఓబుల్ రాజు, జమీర్, ఖాదర్ భాష, సురేష్, కమాలుద్దీన్, మున్నాఫ్, సత్తాజ్, జున్ను, విఘ్నేశ్వర రావు , హఫీజ్, శివకుమార్, హుస్సేన్ , బంకాపురి రాజేష్, రాముడు, లక్ష్మణ్, అయ్యప్ప, షాహుల్, గౌస్ బాషా, తురకా కృష్ణ, విజయ్ రెడ్డి, మున్నా ఫ్, సాతాజ్, విక్రమ్, శ్రీహరి, నాగరాజు, కామేశ్వర రావు, రాము, బద్దెపూడి కృష్ణ, అనిల్, కోటి, షఫీ, షేన్ముగం, శేషయ్య,దుర్గా ప్రసాద్, నాగమణి, దొరసానమ్మ, కరీమా, రుక్మిణి జనసేన నాయకులు కృష్ణవేణి, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)
చైతన్యరథం

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అపోహాలు వీడండి

## విద్యార్థినులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు

రాప్తాడు (చైతన్యరథం): హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అపోహాలు వీడి 14 నుంచి 15ఏళ్ల లోపు బాలికలు ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని కురుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళల ఆరోగ్య రక్షణ కోసం ప్రారంభించిన హెచ్‌పీవీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడ వైద్యులతో మాట్లాడి వ్యాక్సిన్ ఎంత మందికి వేయించారు.. పిల్లల తల్లిదండ్రులు దీనిపై ఏమంటున్నారు వంటి అంశాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ (గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను నివారించడంలో ఈ వ్యాక్సిన్ ఎంతో కీలకమైందన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా దినోత్సవం రోజున దీనిని ప్రారంభించారన్నారు. 14సంవత్సరాలు వయసు పూర్తి అయి 15సంవత్సరాల వయసు లోపల కలిగిన బాలికలకు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ వ్యాక్సిన్ గురించి మొదట చెప్పినప్పుడు చాలా మందిలో అపోహాలు ఏర్పాడ్డాయన్నారు. కరోనా వ్యాక్సిన్ వేయించుకున్న వారికి గుండెపోటు వస్తోందన్న ప్రచారం కూడా జరిగిందన్నారు. కానీ ఈవ్యాక్సిన్ల వలన ఎలాంటి ప్రమాదం ఉండదని స్పష్టం చేశారు. ఇటీవల పెరిగిపోతున్న క్యాన్సర్ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రైవేట్‌గా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలంటే సుమారు 12 వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఇటీవల మహిళల్లో క్యాన్సర్ వ్యాధి ఎక్కువగా కనిపిస్తోందన్నారు. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇటీవల బసవతారకం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించినట్టు చెప్పారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఉచితంగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని అన్నారు. పిల్లల తల్లిదండ్రులకు దీనిపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. అనంతరం కురుగుంట కస్తూరిబా బాలికల జూనియర్ కళాశాల అదనపు భవనాలను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని... ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే పాపంపేట, వివేకానంద నగర్ లో 20లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

### ఎమ్మెల్యేను కలిసిన పీఏసీఎస్ సభ్యులు

రుద్రంపేట, తాడిమర్రి వ్యవసాయ సహకార పరపతి సంఘాల నూతన కమిటీ సభ్యులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిశారు. రుద్రంపేట నూతన అధ్యక్షునిగా నియమితులైన కాటిగాని కాలువ శ్రీనివాసులు, సభ్యులు ఆలమూరు బాల నరసింహులు, కక్కలపల్లి పేట వన్నూరప్ప తాడిమర్రి నూతన అధ్యక్షునిగా నియమితులైన కునుకుంట్ల శ్రీనివాస రెడ్డి, సభ్యులు పిన్నదరి రమణ, మరువపల్లి లక్ష్మీనారాయణ స్థానిక మండల నాయకులతో కలిసి అనంతపురం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతతో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. తమకు పదవులు ఇచ్చినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన కమిటీకి ఎమ్మెల్యే సునీత శుభాకాంక్షాలు తెలిపారు. రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు.






# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## డోన్ శాసనసభ్యుడు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



డోన్ (చైతన్యరథం): ప్యాపిలి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా రైతులకు మూడో విడతగా రూ.6,000ల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోన్ నియోజకవర్గ శాసనసభ్యుడు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా డోన్ నియోజకవర్గ రైతులకు మొత్తం రూ.20.17 కోట్లులి లబ్ధి చేకూరుతున్నట్లు వివరించారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 35,011 మంది రైతులకు రూ.14.01 కోట్లు, అలాగే లిలిపీఎం కిసాన్ పథకం ద్వారా 30,848 మంది రైతులకు రూ.6.16 కోట్లు అందుతున్నాయని తెలిపారు. రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో ఈ పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఏటా రూ.20,000లు అందించాలనే లక్ష్యంతో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ఏడాది చివరి విడతగా రైతుల ఖాతాల్లో ఈ రోజు రూ.6,000 చొప్పున జమ జరుగుతుందని వెల్లడించారు. 2025, 26 ఆర్థిక సంవత్సరానికి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం మొత్తం రూ.8985.41 కోట్లులి విడుదల చేస్తోంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.6560.18 కోట్లు, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.2425.23 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 38,75,844.00 /- చెక్కులను కదిరి పట్టణం ఆర్‌డబి వసతిగృహంలో స్వయంగా చెక్కులను అందజేశారు.**



# తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యం

## మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు వెల్లడి

మడకశిర (చైతన్యరథం): పట్టణంలో చీపులెట్టి వార్డులో తాగునీటి సమస్య పట్ల ఆరాధిసి వేసవికాలంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు అధికారులకు సూచించారు. వడ్డెర పాళ్యం వార్డులో మోటార్ల నూతనంగా బోరు వేయించడం గురించి అధికారులకు సూచించారు. మార్కెట్ యార్డ్ దగ్గర పాల శుద్ధి కేంద్రం ను పరిశీలించి పాలు కల్తీ జరగకుండా పాల ఉత్పత్తి చేయాలని పాల ఉత్పత్తి కేంద్రం వారికి సూచించారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మరమ్మతు కేంద్రాన్ని పరిశీలించి సకాలంలో రైతులకు ట్రాన్స్ఫార్మర్లు మరమ్మతు చేసి అంది ఇవ్వాలని సూచించారు. మల్ల నాయకనపల్లి మరియు యాదవ కాలనీ, చీపులెట్టి వార్డులలో తాగునీటి సమస్య గురించి ప్రజల నుంచి వినతులు రావడంతో తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. వంట గ్యాస్ సిలిండర్లు సకాలంలో ప్రజలకు పంపిణీ చేయాలని సాయిబాబా టెంపుల్ వద్ద ఉన్న న్యూ గ్యాస్ ఏజెన్సీ వారితో మాట్లాడి సకాలంలో సిలిండర్లు పంపిణీ చేయాలని సమస్య లేకుండా సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లు కన్వీనర్ క్లస్టర్ ఇంచార్జిలు నాయకులు పాల్గొన్నారు.



## పసందుగా రంజాన్ తోఫా పంపిణీ

నెల్లూరు(చైతన్యరథం): పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సౌజన్యంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రంజాన్ తోఫా కిట్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పంపిణీ చేశారు. శనివారం మాగుంట లే అవుట్‌లోని వీపీఆర్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నెల్లూరు సిటీ రూరల్ నియోజకవర్గాల పరిధిలోని మసీదులలో పనిచేస్తున్న ఇమామ్‌లు మౌజన్‌లు 'రంజాన్ తోఫా' అందుకున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంట్ సమావేశాల దృష్ట్యా ఢిల్లీలో ఉన్నందున ఆయన తరపున ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ముస్లిం మత పెద్దలకు రంజాన్ తోఫా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో రంజాన్ తోఫా కిట్లు అందిస్తారని చెప్పారు.







# అందరివాడు కోమటి జయరాం

## ఆత్మీయ అభినందన సభలో వక్తల ప్రశంసల జల్లు

అమరావతి (చైతన్యరథం): కేవలం తెలుగువారే గాక భారతదేశం నుంచి వెళ్లిన అనేక మంది ఎన్ఆర్ఐలకు ఆశ్రయమిచ్చిన మానవతావాది కోమటి జయరాం అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున నార్త్ అమెరికా ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన కోమటి జయరాం ఆత్మీయ అభినందన కార్యక్రమం పోరంకిలోని మురళి రిసార్ట్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జస్టిస్ ఎన్వీ రమణ, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి అనంతరం జ్యోతిప్రజలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ... అమెరికా వెళ్లి అంచెలంచెలుగా ఎదిగి స్వయంకృషితో ఉన్నత స్థానానికి చేరుకున్న వ్యక్తి కోమటి జయరాం... జయరాం పేరులోనే జయం ఉందన్నారు. కేవలం ఉత్తర అమెరికాలోనేగాక ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఆయన అభిమానులు ఉన్నారు. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్... సొంత లాభం కొంతమానుకు పొరుగువారికి తోడుపడవోయ్... అన్న అభ్యుదయ కవి గురజాడ చెప్పిన మాటలను త్రికరణశుద్ధితో ఆచరించిన వ్యక్తి జయరాం అని కొనియాడారు. కోమటి జయరాం పడిన కష్టానికి గుర్తింపు లభించిందన్నారు. ఆయనతో ఉన్న స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు.

అమరావతి కోసం రైతులు ఉద్యమం చేస్తుంటే వారికి అనేక రకాలుగా సహాయం అందించారని, రాజధాని రైతుల న్యాయ పోరాటానికి సహాయం చేశారని చెప్పారు. జయరాం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఇబ్బందుల్లో ఉన్న వారికి నేనున్నానని అండగా నిలిచే స్నేహశీలి జయరాం అని అన్నారు. తాను అమెరికా వెళ్లినపుడు దాదాపు 7 రాష్ట్రాల్లో 10 రోజుల పాటు పర్యటించగా, దాదాపు ఏడెనిమిది వేల మంది ఎన్ఆర్ఐలను కలిసే అవకాశం కల్పించారని తెలిపారు. విద్య, ఉద్యోగం నిమిత్తం అమెరికా వెళ్లే తెలుగు బిడ్డలకు పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని కొనియాడారు. నార్త్ అమెరికా స్పెషల్ రిప్రజెంటేటివ్ మరింత మెరుగైన సేవలు అందించాలని అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు.

### పసుపు జెండా రెపరెపలాడించారు: పెమ్మసాని

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ...నేను 25 ఏళ్లు అమెరికాలో ఉన్నాను. అంతకుముందే జయరాంకి అక్కడ మంచి పేరుంది. ఇండియా నుంచి ఎవరు వెళ్లినా జయరాం దగ్గరికి వెళ్తారు. 'తానా'ను ఆయన ఎంతో ముందుకు తీసుకువెళ్లారు. కష్టకాలంలో టీడీపీ జెండాను ఇతర దేశాల్లో రెపరెపలాడించారు. ఎన్టీఆర్ శత జయంత్యుత్సవాలను అనేక దేశాల్లో నిర్వహించారు. ఆయన్ను అభినందించేందుకు ఇవాళ అమెరికా నుంచి ఎంతో మంది తరలివచ్చారు. ఎన్ఆర్ఐలు అమెరికాలో కంప్యూటర్ కీబోర్డు పట్టుకుంటారు... రాష్ట్రం కోసం అవసరమైతే పసుపు జెండా పట్టుకుంటారని అన్నారు. శాసనసభ ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ... అమెరికాలో ఎంతో మందిని సంఘటితం చేసిన వ్యక్తి కోమటి జయరాం. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయంలో ఎన్ఆర్ఐల పాత్ర ఎంతో ఉంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఎవరు అమెరికా వెళ్లిన వారికి కేరాఫ్ అడ్రస్. ఎన్ఆర్ఐలు ఎప్పుడూ కలిసి ఉండాలని ఆయన కోరుకుంటారు. నేను ఇవాళ ఇక్కడ ఉన్నానంటే.. దానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కారణం. ఆయన అందించిన న్యాయ సహాయం వల్లే నేను ఇలా ఉన్నానంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ... జయరాం అందరివాడు. అమెరికాలోనే కాదు... ఆయన తెలుగు ప్రజలందరికీ సుపరిచితుడు. అమెరికాలో తెలుగువారికి ఆయన ఆపద్బాంధవుడని అన్నారు. విద్య, ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లిన యువతకు అన్ని విధాలుగా అండదండలుగా నిలిచే గొప్ప వ్యక్తి అని అన్నారు. 'తానా'కు ఆయన ప్రత్యేక గుర్తింపు తెచ్చారు... అమెరికాలాంటి పాశ్చాత్య దేశంలో తెలుగువారి ఉనికిని చాటిచెప్పి ప్రత్యేక గౌరవాన్ని తెచ్చిన వ్యక్తి జయరాం అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారికి బాసటగా నిలబడిన జయరాంను నార్త్ అమెరికా స్పెషల్ రిప్రజెంటేటివ్‌గా నియమించడం సముచితమని అంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. జీవితంలో పది మందికి చేసిన సేవే సమాజంలో మనకు గుర్తింపునిస్తుంది, జయరాం తండ్రి భాస్కర్‌రావు వద్ద నుంచి విలువలతో కూడిన సామాజిక సేవలందించారని అన్నారు.

### అమెరికాలో ప్రవాసాంధ్రులకు వారధి జయరాం

అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికా వెళ్లిన తెలుగువారికి అన్ని విధాలా చేయూతనందించే వ్యక్తి జయరాం. చిరునవ్వుతో అందరినీ పలకరిస్తూ అమెరికాలో తెలుగుదేశం జెండాను రెపరెపలాడించారు. జయరాంకు స్పెషల్ రిప్రజెంటేటివ్ పదవినిచ్చిన చంద్రబాబునాయుడికి ధన్యవాదాలు తెలిపారు.

సీపీఐ సీనియర్ నేత నారాయణ మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన ఎన్ఆర్ఐలకు జయరాం వారధిగా నిలుస్తున్నారు. ఇప్పుడు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలే కాకుండా అమెరికాలోని డల్లాస్ కూడా 3వ తెలుగు రాష్ట్రంగా మారిందని చమత్కరించారు. అమెరికా వెళ్లిన తెలుగు ప్రజలకు అనేక సమస్యలు వస్తుంటాయి. వాటిని పరిష్కరించే ఒక పెద్ద దిక్కు అవసరం. వారి యోగక్షేమాలను జయరాం చూసుకోవాలి. తన పదవిని అమెరికాలో తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం ఉపయోగించాలని కోరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ... అమెరికా వెళ్లిన వారికి ఆంధ్రలో ఉన్న అనుభూతి కలిగేలా ఆతిధ్యమిచ్చే వ్యక్తి జయరాం అని అన్నారు. అమెరికాలో ఉన్న తెలుగువారికి తలలో నాలుకలా వ్యవహరిస్తూ అన్ని విధాలా సహకారం అందించే జయరాంకు స్పెషల్ రిప్రజెంటేటివ్ పదవి రావడం అభినందనీయమన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ... ఆంధ్రవారు ఎవరైనా అమెరికాలో జయరాం వద్దకు వెళితే ఏపీలో ఉన్న అనుభూతి కలిగిస్తారని అన్నారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ... జయరాంకు పదవి ఇవ్వడం సముచిత వ్యక్తికి సరైన స్థానం ఇవ్వడమేనని అన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ జయరాం తమకు కుటుంబసభ్యుడి లాంటివారు... వారి తండ్రి భాస్కర్‌రావు, తాను కలసి శాసనసభ్యులుగా పనిచేశామని చెప్పారు.

### హాజరైన అతిరథమహారథులు

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీలు కేశినేని చిన్ని, సీఎం రమేష్, రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, సీపీఐ సీనియర్ నేత నారాయణ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, సినీ నటుడు రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గద్దె రామ్మోహన్, ధూళిపాళ నరేంద్రకుమార్, కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరి, గంటా శ్రీనివాస్, బోడె ప్రసాద్, ఆరుమిల్లి రాధాకృష్ణ, కాకర్ల సురేష్, జూలకంటి బ్రహ్మారెడ్డి, వసంత కృష్ణప్రసాద్, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, బండారు సత్యనారాయణమూర్తి, నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, టీడీపీ సీనియర్ నేత దివి శివరాం, స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు, మాజీ పోలీసు అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్లు నన్నపనేని రాజకుమారి, వాసిరెడ్డి పద్మ, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్‌మీరా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర 20సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కల్చరల్ అకాడమీ చైర్మన్ పొడపాటి తేజస్విని, సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం, గుంటూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, నాట్స్ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాస్, ఎన్ఆర్ఐ టీడీపీ కో-ఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్, లాస్ ఏంజిల్స్ ఎన్ఆర్ఐ టీడీపీ ప్రెసిడెంట్ ఆళ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.











# చంద్రబాబు ఆశయాలే స్ఫూర్తిగా...

## రియాద్‌లో ఎన్ఆర్ఐ టీడీపీ భారీ సేవా కార్యక్రమం

### జీతాలు లేక ఇబ్బందుల్లో ఉన్న వెయ్యి మంది భారతీయ కార్మికులకు 'ఇఫ్తార్' విందు

**రియాద్ (సౌదీ అరేబియా):** పవిత్ర రమజాన్ మాసాన్ని పురస్కరించుకుని సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో ఎన్ఆర్ఐ టీడీపీ సౌదీ విభాగం మానవతా దృక్పథంతో భారీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. ఇక్కడ చాలా కంపెనీల్లో న్యాయపరమైన చిక్కులతో సుమారు వెయ్యి మంది భారతీయ కార్మికులు గత ఏడాది కాలంగా జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వారందరికీ విందు ఇచ్చి వారి ముఖాల్లో చిరునవ్వులు పూయించారు. ఎన్ఆర్ఐ టీడీపీ గల్ఫ్ కౌన్సిల్ అధ్యక్షుడు రాధాకృష్ణ రావి, ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు ఖలీద్ సైఫుల్లా ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ టీడీపీ సౌదీ అరేబియా, రియాద్ టీమ్ నాయకులు జానీబాషా షేక్, రాజశేఖర్ చెన్నుపాటి నేతృత్వంలో ఎన్ఆర్ఐ టీడీపీ రియాద్ టీమ్ సభ్యులు ముజామ్మిల్, సారథి నాయుడు, నరేష్ ఏర్పాట్లు చేశారు. తద్వారా ఎన్ఆర్ఐ టీడీపీ తన సేవా గుణాన్ని మరోసారి చాటుకుంది. కష్టాల్లో ఉన్న భారతీయ కార్మికులకు అండగా నిలవాలన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టాం." అని నిర్వాహకులు పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న తమకు, పవిత్ర రమజాన్ మాసంలో ఈ విధంగా ప్రేమను, స్నేహాన్ని పంచడం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చిందని కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం కేవలం విందు మాత్రమే కాకుండా, ఐక్యతను, సేవాభావాన్ని చాటిచెప్పిందని వారు కొనియాడారు.











## అట్లాంటాలో...



# భారతీయ కళా వైభవం

### 'నటరాజ నాట్యాంజలి' ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యార్చన

### గజ్జెల సవ్వడితో అలరించిన నీలిమ గడ్డమనుగు శిష్యగణం

### 'డ్యాన్స్ ఫర్ ఎ కాజ్' సూపర్ సక్సెస్

**అల్ఫారెట్టా (జార్జియా):** అమెరికాలోని అట్లాంటాలో భారతీయ సాంస్కృతిక సౌరభం వెల్లివిరిసింది. అల్ఫారెట్టాలోని డెన్మార్క్ హైస్కూల్ వేదికగా నీలిమ గడ్డమనుగు నేతృత్వంలోని 'నటరాజ నాట్యాంజలి కూచిపూడి డాన్స్ అకాడమీ' నిర్వహించిన "నాట్యాంజలి-2026" వార్షిక నృత్యోత్సవం అద్భుత విజయంతో ముగిసింది. కేవలం కళా ప్రదర్శనగానే కాకుండా "డ్యాన్స్ ఫర్ ఏ కాజ్" (Dance for a Cause) అనే సేవా దృక్పథంతో నిర్వహించిన ఈ వేడుకకు 700 మందికి పైగా కళాభిమానులు హాజరై నీరాజనాలు పలికారు.

**కళాకారుల ప్రతిభా పాటవాలు**

ఈ వేదికపై నాలుగేళ్ల చిన్నారుల నుంచి 45 ఏళ్ల ప్రౌఢ వయస్కుల వరకు దాదాపు 168 మంది విద్యార్థులు తమ అద్భుత అభినయంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. మొత్తం 28 కూచిపూడి నృత్య రూపకాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రదర్శించారు. భారతీయ కళా వైభవాన్ని విదేశీ గడ్డపై భావి తరాలకు అందించడంలో అకాడమీ చూపుతున్న చొరవను అతిథులు కొనియాడారు.

**సామాజిక సేవకు బాసట**

ఈ నృత్యోత్సవం ద్వారా సేకరించిన నిధులను 'శాంతినికేతన్ రిహాబిలిటేషన్ సెంటర్ ఫర్ ది డిసేబుల్డ్ చిల్డ్రన్' సహా మూడు ప్రముఖ సేవా సంస్థల అభివృద్ధికి అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. కళను సామాజిక బాధ్యతతో ముడిపెట్టిన తీరు పలువురిని ఆకట్టుకుంది.

**ముఖ్య అతిథులు**

ఈ వేడుకలో అట్లాంటాలోని పలువురు ప్రముఖులు, సామాజిక నాయకులు పాల్గొన్నారు. వారిలో బాల ఇందుర్తి, మాధవి ఇందుర్తి (శంకర నేత్రాలయ USA), గిరిధర్ కొటగిరి (IFA అధ్యక్షుడు), జ్యోత్స్న పాలకుర్తి (GATA చైర్మన్), రమణ గంద్ర (GATA అధ్యక్షుడు), సునీత పోటూరి (TAMA అధ్యక్షురాలు), ఆది శ్రీనివాసన్, శ్రీరామ్ రాయల, క్రిస్టి ఫెర్నాండెజ్, జనార్దన్ పన్నెల ఉన్నారు.

**గురువు నీలిమ గడ్డమనుగు కృషి**

అకాడమీ వ్యవస్థాపకురాలు, నృత్య గురువు నీలిమ గడ్డమనుగు అంకితభావం ఈ కార్యక్రమ విజయానికి ప్రధాన కారణం. ఆమె శిక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన క్రమశిక్షణ, అభినయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులను తీర్చిదిద్దడంలో, భారతీయ సంప్రదాయ కళను తదుపరి తరాలకు అందించడంలో ఆమె చూపుతున్న శ్రద్ధను అతిథులు కొనియాడారు.

కార్యక్రమానికి శ్రీవల్లి శ్రీధర్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా శివ గడ్డమనుగు స్టేజ్, లైటింగ్, సౌండ్ విభాగాలను పర్యవేక్షించారు. జనార్దన్ పన్నెల సమన్వయకర్తగా వ్యవహరించారు. స్పాన్సర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, వాలంటీర్ల సహకారంతో "నాట్యాంజలి-2026" ఒక మరపురాని సాంస్కృతిక వేడుకగా నిలిచిపోయింది. వారికి అకాడమీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.









చైతన్యరథం

# యుద్ధం వేళ.. దేశంపై దాడికి దిగిన కాంగ్రెస్

## విపక్షం బాధ్యత విస్మరించిందని విరుచుకుపడిన ప్రధాని నరేంద్ర మోదీ



ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో భయాందోళనలు సృష్టించేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం మోదీ అస్సాంలోని సిల్చార్లో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఆయన విపక్షాలపై మండిపడ్డారు. 'యుద్ధం నేపథ్యంలో దేశ పౌరులపై ప్రభావం పడకుండా ఉండేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

ఇలాంటి కీలక సమయంలో కాంగ్రెస్ బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తుందని భావించాం. కానీ, జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విషయంలో అది మరోసారి విఫలమైంది. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇలా భయాలు సృష్టించి.. నన్ను వేధించాలని చూస్తున్నారు' అని మోదీ విమర్శలు చేశారు. భారతదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అస్సాం ప్రజలను ఉద్దేశిస్తూ మీరు కాంగ్రెస్‌ను ఇక్కడినుంచి ఎప్పుడో తరిమికొట్టారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రతి రాష్ట్రం ఆ పార్టీకి గుణపాఠం చెప్పనుందన్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ. మొత్తం దేశం ఈ చర్యను ఖండించిందన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ దేశం పైనే దాడికి దిగిందన్నారు. నిరాశతో దుస్తులు చింపుకోవడం తప్ప వాళ్లకి మరేమీ మిగల్లేదని ఎద్దేవా చేశారు.



# గురు, శిష్యుల మేలుకలయిక

## ఎల్‌కే అద్వానీ నివాసానికి వెళ్ళిన వెంకయ్య నాయుడు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు శుక్రవారం తన రాజకీయ గురువు, మాజీ ఉపప్రధాని ఎల్‌కే ఆడ్వాణీని కలిశారు. ఆటల్ స్మృతిన్యాస్ సొసైటీ అధ్యక్ష హోదాలో ఆ సంస్థ కార్యకలాపాల విస్తృతిపై చర్చించేందుకు ఢిల్లీ వచ్చిన ఆయన ఆడ్వాణీ నివాసానికి వెళ్లి ఆయనతో మర్యాదపూర్వంగా భేటీ అయ్యారు. "నా ప్రజా జీవితంపై ఆడ్వాణీ ప్రభావం చాలా ఉంది. నా రాజకీయ జీవితానికి రూపునివ్వడంలో చాలా కీలక పాత్రపోషించారు. ఆధునిక భారతదేశంలో ఆయన అత్యంత ప్రభావశీల రాజనీతిజ్ఞుడు, ఆయనో జాతిరత్నం. అంకితభావానికి ప్రతిరూపం. దేశం పట్ల నిబద్ధత ఉన్న గొప్ప మనిషి" అని ఈ సందర్భంగా వెంకయ్య పేర్కొన్నారు. అనంతరం తన నివాసంలో పుణె ఎంబీసీ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్ విద్యార్థులను ఉద్దేశించి మాజీ ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. యువతే దేశ భవిష్యత్తు అని, వారు సిద్ధాంతాలు, విలువల ప్రాతిపదికన రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

# ఇండక్షన్ స్టౌవ్‌లతో గ్యాస్ కొరతను అధిగమించండి

## కరెంటుపై రాయితీలు ప్రకటించిన తమిళనాడు ప్రభుత్వం



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశంలో వంటగ్యాస్ సరఫరాపై ఆందోళన నెలకొంది. వాణిజ్య సిలిండర్ల కొరతతో ముంబయి, ఢిల్లీ, చైన్నై సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడుతున్నాయి. ఈ పరిణామాల నడుమ తమిళనాడు ప్రభుత్వం ఓ కీలక ప్రకటన చేసింది. వాణిజ్య సిలిండర్లకు బదులుగా విద్యుత్ సవ్‌లను నియోగించే రెస్టారెంట్లు, హోటళ్లు, చాయ్ దుకాణాలకు కరెంటుపై యూనిట్‌కు రూ.2 చొప్పున రాయితీని ప్రకటించింది. రాష్ట్రంలో ఎల్పీజీ పరిస్థితులపై ప్రభుత్వం శనివారం సమీక్ష నిర్వహించింది. రెస్టారెంట్లు, హోటళ్లు, క్లౌడ్ కిచెన్లు, చాయ్ దుకాణాలకు ఇండక్షన్ స్టవ్ వినియోగంతో వచ్చే అదనపు విద్యుత్ బిల్లుపై యూనిట్‌కు రూ.2 చొప్పున రాయితీని అందించాలని నిర్ణయించింది. వాణిజ్య సిలిండర్ల విషయంలో కేంద్రం ప్రకటించిన పరిమితులు అమలులో ఉన్నంతవరకు ఈ రాయితీ వర్తిస్తుందని అధికారులు తెలిపారు. కొన్ని రోజులుగా హోటళ్లు,రెస్టారెంట్లలో విద్యుత్ వినియోగం పెరిగిందని, విద్యుత్ డిమాండ్ సగటు కంటే సుమారు 50 మెగావాట్లు అధికమైందని చెప్పారు. దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరాకు సంబంధించి కేంద్ర పెట్రోలియం. సహజవాయువు శాఖ ఇటీవల కీలక చర్యలు చేపట్టింది. ఆసుపత్రులు, విద్యాసంస్థలు వంటి అత్యవసర నాన్ డొమెస్టిక్ రంగాలకు ప్రాధాన్యమిస్తూ గ్యాస్ సరఫరాను కొనసాగించాలని నిర్ణయించింది. ఈ పరిణామాల నేపథ్యంలో చాలాచోట్ల దుకాణాలు మూతపడగా పలు ప్రాంతాల్లో ఛార్జీలను పెంచి నడిపిస్తున్నారు.

# జెండా ఎగరేసి హర్మూజ్ జలసంధిని దాటి..

# దేశంలోకి ఎల్పీజీ నౌకలు 'శివాలిక్', 'నందాదేవి'

## గ్యాస్ కొరతపై ఆందోళన నేపథ్యంలో ఉపశమనం కలిగించే ఊసు

హర్మూజ్ జలసంధికి ఇరువైపులా వందలాది నౌకలు చిక్కుకుపోగా.. ఈ మార్గంలో భారత నౌకలు వెళ్లేందుకు అనుమతిస్తామని ఇరాన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు శనివారం ఉదయం సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయని భారత ప్రభుత్వం వెల్లడించింది. 'శివాలిక్', 'నందాదేవి' పేరు గల నౌకలు గుజరాత్లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా వెల్లడించారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పిజ్ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్కు చేరుకునే అవకాశం ఉందన్నారు. దేశంలో ఎల్పీజీ సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోన్న సమయంలో తాజా పరిణామం ఊరట కలిగించే అంశం.

### ఇబ్బందులు లేవు : కేంద్రం

గృహవినియోగ సిలిండర్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అవసరం లేకున్నా చాలామంది బుకింగ్ చేస్తున్నారని తెలిపింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలను కోరామని, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొంది. దేశంలో గ్యాస్, ఎల్పీజీ లభ్యతపై ఆందోళనలు నెలకొన్నవేళ.. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పెట్రోలియం శాఖ. అధికారులు మీడియా సమావేశంలో వెల్లడించారు."వాణిజ్య సిలిండర్లను ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేస్తున్నాం. ఎల్పీజీ సరఫరాలో ప్రస్తుతానికి ఇబ్బందులు లేవు. అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్, బీహార్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో వాణిజ్య సిలిండర్లు అక్రమంగా నిల్వ చేసే వారిపై దాడులు చేస్తున్నాం. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆసుపత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నాం. సిలిండర్ బుక్ అవడం లేదని చాలామంది ఫిర్యాదు చేస్తున్నారు. బుకింగ్‌కు గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల కనీస గడువు ఉంది" అని పెట్రోలియం శాఖ అధికారులు పేర్కొన్నారు.

### నౌకా సిబ్బంది సురక్షితమే..

గల్ఫ్‌లో ఉన్న భారతీయ నౌకలు క్షేమంగానే ఉన్నాయని, వాటిలో ఉన్న భారత సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. హర్మూజ్ జలసంధిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపింది. భారత నావికుల కుటుంబసభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని వెల్లడించింది.



# పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధం రద్దు

## ప్రకటన విడుదల చేసిన కేంద్ర హోం శాఖ



పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ నిర్బంధాన్ని రద్దు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ప్రకటన విడుదల చేసింది. దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ గతేడాది లేహ్ ప్రాంతంలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన హింసాత్మక ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. ఉద్యమకారుడు సోనమ్ వాంగచుక్ పిలుపుతోనే ఈ ఆందోళనలు జరిగాయని కేంద్రం వెల్లడించింది. ఈ క్రమంలోనే జాతీయ భద్రత చట్టం కింద అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. శాంతి భద్రతలను కాపాడాలనే ఉద్దేశంతో కస్టడీలోకి తీసుకున్నట్లు హోంశాఖ ప్రకటనలో వెల్లడించింది. లద్దాఖ్‌లో శాంతికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. ఈ క్రమంలో వాంగుచుక్ నిర్బంధాన్ని తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న బంద్‌లు నిరసనల వాతావరణం శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నాయని అభిప్రాయపడింది.

# ఆయువుపట్టుపై పెనుదాడి

- ఖర్గ్ ఐలాండ్‌పై విరుచుకుపడిన అమెరికా దళాలు
- ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే ప్రధాన లక్ష్యం



ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యంగా.. ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఆ ద్వీపంలోని సైనిక స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. తాజాగా ఈ దాడులను ఇరాన్ కూడా ధ్రువీకరించింది. అయితే, చమురు మౌలిక సదుపాయాలకు ఎలాంటి హాని కలగలేదని వెల్లడించింది. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ.. యూఎస్‌కు గట్టి హెచ్చరికలు చేసింది.

ఇరాన్ మీడియా ప్రకారం.. ఖర్గ్ ఐలాండ్‌పై జరిగిన దాడుల గురించి ఇరాన్ సాయుధ దళాల కార్యాలయం ప్రతినిధి ఓ ప్రకటనలో స్పందించారు. 'మా చమురు మౌలిక సదుపాయాలపై జరిగే ఏ దాడినైనా తీవ్రంగా పరిగణిస్తాం. అలా చేస్తే ఈ ప్రాంతంలో అమెరికాతో సంబంధమున్న చమురు కంపెనీల మౌలిక సదుపాయాలు తుడిచిపెట్టుకుపోతాయి. వాటిని బూడిద కుప్పలుగా మార్చేస్తాం' అని హెచ్చరించారు. ఇక, ఇరాన్ చమురుకు వ్యూహాత్మక హబ్ అయిన ఖర్గ్ ఐలాండ్‌పై తన ఆదేశాల మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ దాడి చేసిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇక్కడి చమురు సదుపాయాల జోలికి వెళ్లలేదని వెల్లడించారు. హర్మూజ్ జలసంధివద్ద నౌకల రవాణాను అడ్డుకుంటే మాత్రం.. వాటిని కూడా టార్గెట్ చేస్తామని హెచ్చరికలు జారీచేశారు.

**పశ్చిమాసియా చరిత్రలోనే శక్తివంతమైన దాడులు**

పశ్చిమాసియాలో రణరంగం కొనసాగుతోంది. ఇప్పటివరకు ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్న అమెరికా.. ఇప్పుడు ఆ దేశ ఆర్థిక వ్యవస్థను టార్గెట్ చేసింది. ఇరాన్ చమురుకు వ్యూహాత్మక హబ్ అయిన ఖర్గ్ ఐలాండ్‌పై యూఎస్ బలగాలు విరుచుకుపడ్డాయి. పశ్చిమాసియా చరిత్రలోనే అత్యంత శక్తిమంతమైన దాడుల్లో ఇదొకటిగా చెబుతున్నారు. అమెరికా ఆయుధ వ్యవస్థలు అత్యంత శక్తిమంతమైనవని ట్రంప్ అన్నారు. తాము లక్ష్యంగా చేసుకునే వాటిని రక్షించుకునే సామర్థ్యం ఇరాన్‌కు లేదన్నారు. ఆ దేశం అణ్వాయుధాలు కలిగి ఉండకూడదని ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఆ దేశ సైన్యంతోపాటు వారితో సంబంధాలు ఉన్నవారు వెంటనే ఆయుధాలు విడిచిపెట్టాలని ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్‌లో మిగిలివున్న ప్రాంతాలను కాపాడుకోవడం తెలివైన పనిగా పేర్కొన్నారు. ఖర్గ్ ఐలాండ్ దాడులపై ఇరాన్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

పర్షియన్ గల్ఫ్ ఖర్గ్ ఒక చిన్న ద్వీపం. ఇరాన్ తీరానికి 25-30 కి.మీ దూరంలో ఉండే ఇది.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకం. ఇరాన్ తమ చమురు ఎగుమతుల్లో 90 శాతం ఇక్కడి నుంచే నిర్వహిస్తోంది. 1986నుంచి ఇక్కడ విదేశీ పెట్టుబడులు పెరగడంతో.. ఇరాన్ ఇంధన ఎగుమతులకు కీలకంగా మారింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ దాదాపు 13.7 మిలియన్ బ్యారెళ్ల చమురును ఈ ద్వీపంనుంచి ఎగుమతి చేసింది. ఉద్రిక్తతల్లో ఇప్పటివరకు ఈ ఐలాండ్ను టచ్ చేయని ట్రంప్.. తాజాగా ఇక్కడ దాడులకు పాల్పడటం ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఈ పరిణామాలతో యుద్ధం మరింత తీవ్రమయ్యే సంకేతాలు కన్పిస్తున్నాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పటికే భగ్గుమంటున్న చమురు ధరలు.. మరింత దూసుకెళ్లే అవకాశం ఉంది.

# గ్రీన్‌కార్డుల కోసం చోరీల డ్రామా

**11మంది భారతీయుల అరెస్ట్**



అమెరికాలో అక్రమంగా ఉంటూ వీసా మోసాలకు పాల్పడ్డారన్న అభియోగాలపై 11మంది భారతీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రీన్‌కార్డుల కోసం వీరు చోరీల డ్రామాలకు పాల్పడినట్టు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. దోపిడీ బాధితులమని కట్టుకథలల్లి 'యూ-వీసా' పొందేందుకు ప్రయత్నించినట్టు పేర్కొన్నారు. హింసాత్మక నేరాల్లో బాధితులైన వారు అమెరికాలో చట్టబద్ధంగా ఉండేందుకు యూ-వీసా (నాన్ ఇమిగ్రేషన్ స్టేటస్)కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ వీసాతో వలసదారులకు పని అనుమతులతోపాటు 5-10 ఏళ్లలో గ్రీన్కార్డు పొందేందుకు మార్గం లభిస్తుంది. దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు వలసదారులు మోసాలకు పాల్పడినట్టు యూఎస్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు వెల్లడించారు. ఈ కేసులకు సంబంధించి మసాచుసెట్స్, కెంటకీ, ఒహాయో తదితర రాష్ట్రాల్లో 11మంది భారతీయులను పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరంతా అక్రమంగా అమెరికాలో నివాసం ఉంటున్నట్టు అధికారులు పేర్కొన్నారు. వీరిలో ఓ వ్యక్తిని భారతకు డిపోర్ట్ చేయగా.. మరో ఆరుగురిని కోర్టులో హాజరుపర్చి విడుదల చేశారు. మిగతా నలుగురిని రిమాండ్‌లో ఉంచారు. నిందితులు ఓ ముఠాగా ఏర్పడి వ్యవస్థీకృత మోసాలకు పాల్పడినట్టు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు, స్టోర్లవద్ద దోపిడీలు చేయించినట్టు తెలిపారు. అనంతరం ఈ ఘటనల్లో తాము బాధితులంటూ నమ్మించి యూ వీసాలకు దరఖాస్తులు చేసే ప్రయత్నం చేశారని అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో నేర నిర్ధరణ అయితే నిందితులకు ఐదేళ్ల వరకు జైలుశిక్ష, 2.5 లక్షల డాలర్ల జరిమానా పడే అవకాశముంది.

## కవ్విస్తున్న ఉ.కొరియా



అమెరికా-దక్షిణ కొరియా వార్షిక సైనిక విన్యాసాలవేళ ఉత్తరకొరియా కవ్వింపులకు పాల్పడుతోంది. వరుసగా క్షిపణి ప్రయోగాలు చేపడుతూ బలప్రదర్శనకు దిగింది. శనివారం ఏకంగా 10 క్షిపణులను ఒకేసారి ప్రయోగించింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియా మిలిటరీ వెల్లడించింది. ఉత్తరకొరియా రాజధాని ప్యోంగ్యాంగ్ సమీపంనుంచి ఈ క్షిపణులను ప్రయోగించినట్టు దక్షిణ కొరియా తెలిపింది. అయితే, ఇవి ఎంతదూరం ప్రయాణించాయో తమకు తెలియదని పేర్కొంది. మరోవైపు, జపాన్ రక్షణ శాఖ ఈ పరిణామాలపై స్పందించింది. కిమ్ సర్కారు ప్రయోగించిన ఆయుధాలు తమ దేశ ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ వెలుపలున్న సముద్ర జలాల్లో పడినట్టు తెలిపింది. ఈ వారం ఆరంభంలోనూ ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం చేపట్టింది. ఓ యుద్ధనౌక నుంచి తీరానికి సమీపంలోని దీవులపై క్రూజ్ క్షిపణులను ప్రయోగించింది. ఆ ప్రయోగ పరీక్షలను ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్, తన 13 ఏళ్ల కుమార్తె కిమ్ జుయేతో కలిసి కన్వెన్షన్ హాలులో కూర్చుని వీక్షించినట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా సంస్థ వెల్లడించింది. తమ దేశంపై అణ్వస్త్ర దాడి ముప్పును నిరోధించడానికే ఈ శక్తిమంతమైన క్షిపణులతో ప్రయోగాలు చేస్తున్నట్లు కిమ్ ఇప్పటికే ప్రకటించారు.

## ఇరాక్‌లోని యూఎస్ ఎంబసీపై క్షిపణి దాడి



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఇరాన్ వ్యూహాత్మక ద్వీపంపై అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో టెహ్రాన్ ప్రతిదాడులకు దిగింది. తాజాగా ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో అగ్రరాజ్య ఎంబసీపై క్షిపణి దాడి జరిగింది. ఘటనలో హెలిప్యాడ్ ధ్వంసమైనట్టు ఇరాక్ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. క్షిపణి దాడితో ఎంబసీ ప్రాంతంలో దట్టమైన పొగ అలముకుంది. అమెరికాకు చెందిన అతిపెద్ద దౌత్యకార్యకలాపాల్లో ఒకటైన బాగ్దాద్ కాంప్లెక్స్‌పై ఇరాన్ పదేపదే రాకెట్లు, డ్రోన్లతో దాడులు చేస్తోంది. తాజా ఘటన కూడా టెహ్రాన్ పనే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అగ్రరాజ్య రాయబార కార్యాలయం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు.

**24 గంటల్లో దుబాయ్‌పై మరో దాడి**

మరోవైపు, దుబాయ్‌లో ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రమైన ఓ భవనంపై దాడి జరిగింది. 24 గంటల్లో ఈ ప్రాంతంలో రెండోసారి దాడి జరగడం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, భవనం మాత్రమే దెబ్బతిందని దుబాయి మీడియా ఆఫీస్ ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. శుక్రవారం కూడా ఈ నగరంలోని ఓ భవనంపై డ్రోన్ దాడి జరిగినట్టు కథనాలు వెలువడ్డాయి.

## పశ్చిమాసియాలో భారీగా మోహరించిన 'మెరోప్స్'!



ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులను రోజురోజుకు ఉధృతం చేస్తున్నాయి. డ్రోన్లు, క్షిపణులను భారీస్థాయిలో వినియోగిస్తున్నాయి. ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికా 10 వేల డ్రోన్లను పశ్చిమాసియాలో మోహరించినట్లు బ్లూమ్‌బెర్గ్ కథనం వెల్లడించింది. కృత్రిమ మేధతో పనిచేసే 'మెరోప్స్' ఇంటర్‌సెప్టర్లకు.. శత్రు డ్రోన్లను వేటాడి నాశనం చేసే సామర్థ్యముంది. గూగుల్ మాజీ సీఈఓ ఎరిక్ ష్మిత్ నేతృత్వంలోని ఓ రక్షణ ఉత్పత్తుల సంస్థ.. 'ప్రాజెక్ట్ ఈగల్'లో భాగంగా మెరోప్స్ డ్రోన్లను అభివృద్ధి చేసింది. 2024లో ఉక్రెయిన్ యుద్ధంలో వీటిని భారీస్థాయిలో వినియోగించారు. అటువైపు ఇరాన్ అభివృద్ధి చేసిన షాహెద్ డ్రోన్లను రష్యా వినియోగించగా.. వాటిని మెరోప్స్ ఇంటర్‌సెప్టర్ డ్రోన్లు సమర్థవంతంగా కూల్చివేసినట్లు అమెరికా రక్షణశాఖ అధికారులు పేర్కొన్నారు. తాజా యుద్ధంలోనూ ఇరాన్ షాహెద్ డ్రోన్లను ప్రయోగిస్తోంది. వీటిని అడ్డుకునేందుకు అమెరికా భారీ సంఖ్యలో మెరోప్స్ డ్రోన్లను మోహరిస్తున్నట్లు తెలుస్తోంది. మెరోప్స్ ఇంటర్సెప్టర్ ఒక్కో డ్రోన్ ఖర్చు దాదాపు 14 వేలనుంచి 15 వేల డాలర్లు ఉంటుందని అంచనా. అయితే, భారీ సంఖ్యలో ఆర్డర్ చేస్తే మాత్రం ఒక్కోటి మూడునుంచి ఐదు వేల డాలర్లకే లభిస్తుందని అక్కడి రక్షణరంగ నిపుణులు చెబుతున్నారు. ఇరాన్ అభివృద్ధి చేసిన షాహెద్ డ్రోన్ తయారీకి 20వేల డాలర్లు ఖర్చు అవుతుందని అంచనా.

## సౌదీ బేస్‌పై దాడి

**ఐదు అమెరికా రీఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసం**

అమెరికా వాయుసేనకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు తెలుస్తోంది. సౌదీ అరేబియాలోని వైమానిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో యూఎస్ వైమానిక దళానికి చెందిన ఐదు రీఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసమైనట్లు సమాచారం. యూఎస్ అధికారులు ఈ విషయం పేర్కొన్నట్టు వాలెట్ జర్నల్ తన కథనంలో వెల్లడించింది. దాని ప్రకారం.. సౌదీ అరేబియాలోని ఎయిర్‌బేస్‌పై జరిగిన దాడుల్లో ఐదు కేసీ-135 రీఫ్యూయలింగ్ విమానాలు దెబ్బతిన్నాయి. ట్యాంకర్లు దెబ్బతిన్నప్పటికీ.. అవి పూర్తిగా ధ్వంసం కాలేదు. వాటికి మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని అధికారులు తెలిపారు. దీనిపై స్పందించేందుకు యూఎస్ సెంట్రల్ కమాండ్ నిరాకరించింది. కాగా.. ఇరాక్‌లో అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.

## మొజ్తాబా సమాచారమిస్తే నజరానా రూ.93 కోట్లు

**- భారీ ఆఫర్ ప్రకటించిన అమెరికా**

ఇరాన్ సుప్రీం లీడర్‌గా నియమితులైన మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కోసం అమెరికా భారీ ఆఫర్ ప్రకటించింది. ఆయన ఎక్కడున్నారన్న సమాచారం చెప్పేవారికి 10 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.93 కోట్లు) ఇస్తామని పేర్కొంది. ఎక్స్‌లో యూఎస్ విదేశాంగశాఖ ఈ మేరకు ప్రకటన చేసింది. సుప్రీం నేత ఖమేనీతో పాటు, ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ అలీ అస్గర్ హెజాజీ, ఇరాన్ భద్రతాధికారి అలీ లారిజాని సహా పలువురి పేర్లను యూఎస్ విదేశాంగశాఖ ప్రస్తావించింది. వీరు ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్నారని ఆరోపించింది. వీరికి సంబంధించిన సమాచారం ఉంటే ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ లేదా టోర్ నెట్వర్క్ ద్వారా తెలియజేయాలని పేర్కొంది. ఇందుకుగాను తగిన బహుమతి అందిస్తామని తెలిపింది. సమాచారం అందించిన వారికి పునరావాసం కల్పించనున్నట్టు కూడా వెల్లడించింది. ఇక, అమెరికా-ఇజ్రాయెల్ తొలిరోజు జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తర్వాత ఆయన వారసుడిగా మొజ్తాతా ఎన్నికయ్యారు. యుద్ధం నేపథ్యంలో మొజ్తాబా ఇప్పటివరకు బహిరంగంగా కనిపించలేదు. ఆయన ఎక్కడున్నారనే విషయంపై స్పష్టత లేదు.

# ఆ ముగ్గురికి లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డ్

భారత క్రికెట్‌లో విశిష్ట సేవలు అందించిన ముగ్గురు దిగ్గజాలను సీకే నాయుడు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుతో బీసీసీఐ సత్కరించనుంది. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, టీమిండియా మాజీ కెప్టెన్, కోచ్ రాహుల్ ద్రవిడ్, మహిళా క్రికెట్ మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌లు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. వీరిని ఆదివారం ఢిల్లీలో జరిగే నమన్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో సన్మానించనున్నారు. నమన్ అవార్డ్స్‌లో ఈ ఏడాది ఐసీసీ ట్రోఫీలు గెలిచిన ఐదు భారత జట్లను కూడా ప్రత్యేకంగా గౌరవించనున్నారు.



**ఐసీసీ ట్రోఫీలు గెలిచిన ఐదు జట్ల వివరాలు**

**భారత పురుషుల జట్టు: ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025**
**భారత పురుషుల జట్టు: టీ20 ప్రపంచ కప్ 2026**
**భారత మహిళా జట్టు: మహిళల వన్డే ప్రపంచ కప్ 2025**
**అండర్ 19 పురుష జట్టు: అండర్ 19 ప్రపంచ కప్ 2025**
**అండర్ 19 మహిళల జట్టు: అండర్ 19 ప్రపంచ కప్ 2025**

**రోజర్ బిన్నీ సేవలు విశేషం**

రోజర్ బిన్నీ.. 1983 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో కీలక సభ్యుడు. ఆ టోర్నీలో అత్యధిక వికెట్లు సాధించిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత కోచ్, సెలెక్టర్‌గా కూడా సేవలందించాడు. 2000లో భారత అండర్–19 జట్టును ప్రపంచ కప్ విజేతగా తీర్చిదిద్దాడు. 2022 నుంచి 2025 వరకు బీసీసీఐ 36వ అధ్యక్షుడిగా పనిచేసి భారత క్రికెట్ అభివృద్ధికి కృషి చేశాడు.

**ద్రవిడ్‌కు ప్రత్యేక గౌరవం**

భారత క్రికెట్ చరిత్రలోనే రాహుల్ ద్రవిడ్ అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడు. తన కెరీర్‌లో 24 వేలకుపైగా అంతర్జాతీయ పరుగులు సాధించి రికార్డు నెలకొల్పాడు. పదేళ్లకు పైగా భారత బ్యాటింగ్‌లో ఎంతో కీలక పాత్ర పోషించాడు. అందుకే ఆయన్ని 'ది వాల్' అని కూడా అంటారు. అనంతరం నేషనల్ క్రికెట్ అకాడమీ అధిపతిగా యువ క్రికెటర్లను తీర్చిదిద్దాడు. 2018లో అండర్–19 ప్రపంచకప్ విజేతగా భారత జట్టును తీర్చిదిద్దాడు. తర్వాత భారత పురుషుల జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టి 2024 టీ20 ప్రపంచకప్ విజయానికి మార్గనిర్దేశం చేశాడు.

**మిథాలీ రాజ్ ప్రభావం**

మహిళా క్రికెట్‌లో ఎనలేని సేవలు అందించింది మిథాలీ రాజ్. తన కెరీర్‌లో 20 సంవత్సరాలకు పైగా అంతర్జాతీయ క్రికెట్ ఆడింది. మహిళల వన్డేల్లో అత్యధిక పరుగులు (7805) చేసిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పింది. ఆమె నాయకత్వంలో భారత మహిళల జట్టు రెండుసార్లు ప్రపంచ కప్ ఫైనల్స్‌కు చేరింది. మహిళల క్రికెట్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో మిథాలీ కీలక పాత్ర పోషించింది.

**ఇతర అవార్డులు**

2024–25 సీజన్‌కు 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచిన స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ 'పాలీ ఉమ్రిగర్ అవార్డు' (ఉత్తమ అంతర్జా తీయ క్రికెటర్–పురుషులు) అందుకోనున్నాడు. మహిళల విభాగం లో స్మృతి మంధాన ఐదోసారి ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్ అవార్డు అందుకోనుంది. దేశీయ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన ఆటగాళ్లకూ బీసీసీఐ వివిధ అవార్డులు ప్రదానం చేయ నుంది. అలాగే ముంబై క్రికెట్ అసోసియేషన్ ఈసారి కూడా బీసీసీఐ దేశీయ టోర్నీల్లో అత్యుత్తమ ప్రదర్శన అవార్డును అందుకోనుంది.

## వీడియో అనలిస్ట్‌పై జీవితకాల నిషేధం




స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడిన ఓ వీడియో అనలిస్ట్‌పై బీసీసీఐ కఠిన చర్యలు తీసుకుంది. రంజీ ట్రోఫీ 2024 సీజన్‌లో రాజా రెడ్డి అనే వ్యక్తి ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. విచారణ చేపట్టిన బీసీసీఐ.. నేరం రుజువు కావడంతో చర్యలకు ఉపక్రమించింది. అతడిపై జీవితకాల నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. రెండేళ్ల క్రితం ఆంధ్ర–మధ్య ప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ సమయంలో వీడియో అనలిస్ట్ రాజా రెడ్డి ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై యాంటీ కరప్షన్ అండ్ సెక్యూరిటీ యూనిట్ విచారణ చేపట్టింది. కండక్టర్ కోడ్ ఆర్టికల్స్ 2.1.3, 2.1.14 కింద రాజా రెడ్డిపై నిషేధం విధించింది. బీసీసీఐ నియమించిన వీడియో అనలిస్ట్ కావడంతో అతడికి థర్డ్ అంపైర్, మ్యాచ్ రిఫరీ రూమ్‌లకు వెళ్లేందుకు అనుమతి ఉంది. ఆంధ్ర జట్టు మేనేజర్ చేసిన ఫిర్యాదు ప్రకారం.. జట్టు 'ప్లేయింగ్ XI'కు సంబంధించిన సమాచారాన్ని అందించినందుకు ఆంధ్ర ఆటగాడు గిరినాథ్ రెడ్డికి రూ.5లక్షల మొత్తాన్ని రాజా రెడ్డి ఆఫర్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాట్సప్ కాల్, చాట్ హిస్టరీని బీసీసీఐ కమిటీ పరిశీలించింది. గిరినాథ్ రెడ్డి ఈ విషయాన్ని టీమ్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లాడని.. తమకు వచ్చిన ఫిర్యాదుతో విచారించగా రాజా రెడ్డి నేరం చేసినట్టు తేలిందని బీసీసీఐ వెల్లడించింది.

## హెల్మెట్-గ్లౌవ్స్ విసిరికొట్టిన సల్మాన్ అఘా

**- రనౌట్ వివాదంపై ఐసీసీ చర్యలు**



పాకిస్థాన్–బంగ్లాదేశ్ మధ్య జరిగిన రెండో వన్డేలో సల్మాన్ అఘా రనౌట్ వివాదం తీవ్రస్థాయికి చేరుకుంది. ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్రీడాస్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని కొందరు అంటుండగా.. ఇది ఓ అంతర్జాతీయ మ్యాచ్, విజయం కోసం ఆడుతున్నప్పుడు ఇలాంటివి జరుగుతా యంటూ మరికొందరు అంటున్నారు. ఏదేమైనప్పటికీ మైదానంలో అనుచితంగా ప్రవర్తించినందుకు పాక్ ప్లేయర్ సల్మాన్ అలీ అఘాపై ఐసీసీ చర్యలు తీసుకుంది. ఔట్ నిర్ణయం రాగానే హెల్మెట్, బ్యాట్‌ను అఘా విసిరికొట్టాడు. మ్యాచ్ రిఫరీ నీయముర్ రషీద్ ఫిర్యాదు మేరకు లెవల్ 1 నేరానికి అఘా పాల్పడినట్లు ఐసీసీ తేల్చింది. 'క్రికెట్ పరికరాలను అగౌరవపరి చినట్లు అఘాపై ఫిర్యాదు అందింది. మైదానంలోనే అతడు హెల్మెట్, గ్లౌవ్స్, బ్యాట్‌ను విసిరేసినట్లు తేలింది. గతంలో అతడి నుంచి ఇలాంటి ప్రవర్తన చూడలేదు. అయితే ఇప్పుడు మాత్రం అఘా చేసిన దానికి చర్యలు తీసుకుంటున్నాం. అతడి ఖాతాలో ఓ డీమెరిట్ పాయింట్ జత చేశాం. బంగ్లాదేశ్ ప్లేయర్ లిటన్ దాస్‌తో వాగ్వాదంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అది కేవలం అపార్థంగా పరిగణించాం. మేం చట్టం ప్రకారమే నడు చుకున్నాం. నిష్పక్షపాతంగా వ్యవహరించి ఈ తీర్పు ఇచ్చాం' అని ఐసీసీ స్పష్టం చేసింది.

తాను రనౌట్ అయిన విధానంపై మ్యాచ్ అనంతరం సల్మాన్ అఘా స్పందించాడు. 'నిబంధనల ప్రకారం అది ఔటే. నేనేం కాదనను. కానీ.. నేనే ఆ స్థానంలో ఎప్పటికీ అలా చేయను. క్రీడాస్ఫూర్తితో వ్యవహరిస్తాను. మేం గతంలోనూ ఇలాంటి పని చేయలేదు. భవిష్యత్తులోనూ చేయబోం. నిజానికి ఆ బాల్ నా ప్యాడ్, బ్యాట్‌ను తాకింది. దాంతో నన్ను రనౌట్ చేయరను కున్నాను. దీంతో బంతిని బౌలర్‌కు అందిద్దామనుకున్నా. ఆ సమయంలో నాకసలు పరుగు తీసే ఉద్దేశమే లేదు. కానీ మిరాజ్ నన్ను రనౌట్ చేశాడు' అని సల్మాన్ అఘా అన్నాడు.




## మహిళల క్రికెట్‌కు యమా క్రేజ్

**- ఆరేళ్లలో ఐదు శాతం పెరుగుదల**

**- బీబీసీ సర్వేలో వెల్లడి**

న్యూఢిల్లీ: దేశంలో మహిళల క్రికెట్‌కు క్రేజ్ అంతా ఇంతా లేదు. క్రికెట్ ఆడే మహిళల సంఖ్య అనూహ్యంగా పెరగడమే అందుకు ఉదాహరణ. ఈమేరకు బీబీసీ చేసిన సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. మొత్తం 10 వేల మంది మహిళల ను సర్వే చేశారు. క్రికెట్ ఆడే మహిళల సంఖ్య 2020లో ఐదు శాతం ఉంటే ప్రస్తుతం అది 10 శాతానికి పెరగడం విశేషం. యువతులు క్రికెట్ ఆడేందుకు మరింత మక్కువ ప్రదర్శిస్తు న్నారు. క్రికెట్ ఆడే 15 నుంచి 24 ఏళ్ల వయస్సుగల యువతు లు 2020లో ఆరు శాతంగా ఉంటే..ప్రస్తుతం వారి సంఖ్య 16 శాతానికి హెచ్చింది. 15 నుంచి 24 ఏళ్ల వయస్సుగల మహిళలు ప్రతి నలుగురిలో ఒకరు క్రీడలను కెరీర్‌గా ఎంచుకుంటామని చెప్పడం..దేశంలో ఆటలకు ఆదరణ ఏ స్థాయిలో పెరిగిందో అర్థమవుతుంది. భారత మహిళల క్రికెట్ జట్టు ఇటీవలి కాలంలో అద్భుతమైన ప్రదర్శన చేస్తోంది. ఉమెన్ ఇన్ బ్లూ గత ఏడాది వన్డే వరల్డ్ కప్‌ను అందుకోగా..ఇటీవల ఆస్ట్రేలియాలో ఆ జట్టుపై ద్వైపాక్షిక టీ20 సిరీస్‌నూ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇంకా..మహిళల ప్రీమియర్ లీగ్‌కు లభిస్తున్న ఆదరణ.. వెరసి యువతులు క్రికెట్‌పట్ల అమితాసక్తి కనబరిచేందుకు దోహదం చేశాయని అంటున్నారు.

**తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్‌కు..**

రెండు తెలుగు రాష్ట్రాల్లో యువతులు బ్యాడ్మింటన్ పట్ల మొగ్గు చూపుతున్నట్టు సర్వేలో తేలింది. తెలంగాణ, ఏపీతోపాటు పంజాబ్‌లోనూ మహిళలు బ్యాడ్మింటన్‌వైపు అడుగులు వేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో పీవీ సింధు, సైనా నెహ్వాల్ సాధించిన ఘనతలు తెలుగు రాష్ట్రాల యువతులు బ్యాడ్మింటన్‌ను కెరీర్‌గా ఎంచుకోవడంలో కీలక పాత్ర పోషిస్తు న్నాయి. హైదరాబాద్‌లో ఉన్న అధునాతన బ్యాడ్మింటన్ శిక్షణ సదుపాయాలు కూడా దీనికి మరో కారణం.


## కేకేఆర్‌కు భారీ ఎదురు దెబ్బ..

**ఐపీఎల్‌కు హర్షిత్ రాణా దూరం**



ఐపీఎల్ 2026 సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ట్రోఫీని గెలవడమే లక్ష్యంగా అన్ని జట్లు వ్యూహాలు, ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ క్రమంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ హర్షిత్ రాణా ఐపీఎల్‌కు దూరమయ్యాడని క్రీడా వర్గాల నుంచి వార్తలు వస్తున్నా యి. టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు ముంబైలో దక్షిణాఫ్రి కాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో హర్షిత్ రాణా మోకాలికి గాయమైంది. దీంతో రాణా ఈ ఐసీసీ ఈవెంట్‌కు దూరమయ్యా డు. ఫిబ్రవరి 9న ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ప్రస్తుతం అతడు ఇంకా గాయం నుంచి కోలుకోలేదని సమాచా రం. ఈ కారణంగా త్వరలో ప్రారంభం కానున్న ఐపీఎల్‌కు కూడా దూరం కానున్నాడని సమాచారం. ఈ విషయాన్ని కేకేఆర్ ఫ్రాం చైజీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అతడి స్థానంలో ఇప్పటి వరకు ఎవర్నీ రిప్లేస్మెంట్‌గా తీసుకోలేదు. 'హర్షిత్ రాణా త్వరలో జరగనున్న ఐపీఎల్ 2026కు అందుబాటులో ఉండకపోవచ్చు. అతడి స్థానంలో జట్టులోని ఇతర బౌలర్లు వైభవ్, ఉమ్రాన్, కార్తీక్, ఆకాశ్ ఆడే అవకాశం ఉంది. హర్షిత్ స్థానంలో ఇంకా ఎవరినీ ఎంపిక చేయలేదు' అని కేకేఆర్ కు చెందిన ఓ అధికారి చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల నుంచి తెలుస్తుంది. 2024 ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతా టైటిల్ గెలుచుకోవడంలో రాణా కీలక పాత్ర పోషించా డు. ఆ సీజన్లో 19వికెట్లతో సాధించాడు. 2025 సీజన్‌కు ముందు అతడిని రూ.4 కోట్లకు కేకేఆర్ రిటైన్ చేసుకుంది. ఆ సీజన్‌లో 13 మ్యాచులు ఆడి 15వికెట్లు తీశాడు. మరోవైపు ఇదే ఫ్రాంచైజీ జింబాబ్వే ఫాస్ట్ బౌలర్ బ్లెస్సింగ్ ముజారబానీతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. త్వరలోనే అతడు కేకేఆర్ జట్టులో చేరనున్నాడు.

# ఉగాదికి.. ఉస్తాద్ జాతరే!




ఈ ఉగాది కానుకగా మన తెలుగు సినిమానుంచి వస్తున్న ఏకైక పెద్ద సినిమా ఏదన్నా ఉందీ అంటే అది పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న సాలిడ్ మాస్ చిత్రం "ఉస్తాద్ భగత్ సింగ్" అనే చెప్పాలి.

దర్శకుడు హరీష్ శంకర్‌తో వస్తున్న రెండో సినిమా కావడంతో అంతా మళ్లీ అంతా గబ్బర్‌సింగ్ రేంజ్ హిట్ కొట్టాలని ఎదురు చూస్తున్నారు. మేకర్స్ అంతా చాలా నమ్మకంగానే ఉన్నారు. అయితే ఆడియెన్స్‌లో మరింత నమ్మకం కలిగించడానికి సిద్ధం చేసిన ట్రైలర్ కట్‌ని ఇప్పుడు మేకర్స్ విడుదల చేశారు. ఇక ఈ ట్రైలర్ అభిమానులు అంచనాలకు తగ్గట్టే సాలిడ్‌గా ఉందని చెప్పాలి. దర్శకుడు హరీష్ శంకర్ ఈ ట్రైలర్‌ని మాత్రం ఫ్యాన్స్ హైప్‌కి ఏమాత్రం తగ్గకుండా కట్ చేయడం విశేషం. యాక్షన్, ఎంటర్టైనింగ్ అంశాలు పవన్‌నుంచి చాలాకాలంగా మిస్ అవుతున్న డైలాగ్‌లు ప్రాసలు.. మధ్యలో అలా 'ఓజి' కూడా వచ్చి వెళ్లడంవంటి అంశాలతో మంచి ఎనర్జిటిక్‌గా ప్లాన్ చేయడం మరింత హైప్‌ని తీసుకొచ్చింది. ఇక శ్రీలీలతో కెమిస్ట్రీ, రాశిఖన్నా రోల్ కూడా ఇందులో బాగా కనిపిస్తున్నాయి. థమన్ స్కోర్ కూడా ఇంప్రెస్ చేసే విధంగా ఉంది. అయితే ట్రైలర్‌లో చిన్న టెక్నికల్ లోపాలున్నట్టు కనిపిస్తుంది. స్టార్టింగ్ ఫైట్ బిట్‌లో మ్యూజిక్ సింక్ లేదు. పవన్ డబ్బింగ్ కూడా క్లారిటీ లోపించినట్టు కనిపిస్తుంది. సో వీటిని సెట్ చేసుకొని వస్తే మాత్రం ఉగాదికి ఉస్తాద్ ఊచకోత థియేటర్స్‌లో మాస్ జాతరని ఆపడం రెండు తెలుగు రాష్ట్రాల్లో కష్టమేనని చెప్పాలి.

# విశ్వనాథ్ అండ్ సన్స్.. టీజర్ రెడీ



కోలీవుడ్ నటుడు సూర్య హీరోగా మమితా బైజు హీరోయిన్‌గా దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న అవైటెడ్ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రమే 'విశ్వనాథ్ అండ్ సన్స్'. రీసెంట్‌గా ఫస్ట్ లుక్, టైటిల్ రివీల్‌తో మంచి బజ్‌ని ఈ సినిమా అందుకుంది. ఇక ఈ సినిమానుంచి మేకర్స్ మరో సాలిడ్ అప్డేట్ అందించారు. ఈ సినిమా తాలూకా టీజర్ రిలీజ్‌కి డేట్ మరియు సమయాన్ని ఖరారు చేసేసారు. ఈ మార్చ్ 16న సాయంత్రం 4 గంటల 6 నిమిషాలకి విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఓ ప్రీ లుక్ పోస్టర్‌లో సూర్య, మమితా బైజులు నడుస్తూ కనిపిస్తున్నట్టు కనిపిస్తున్నారు. మరి ఈ టీజర్‌తో చాలామంది ఈ సినిమాపట్ల మంచి క్లారిటీ రావచ్చు. ఆల్రెడీ సాలిడ్ ట్రాక్ రికార్డు వెంకీ అట్లూరికి, సితారవారికి ఉంది. దీనితో ఈ సినిమా కోసం తెలుగుతో పాటుగా తమిళ ఆడియెన్స్ కూడా అంతే ఎగ్జైటెడ్‌గా ఎదురు చూస్తున్నారు. మరి ఈ సినిమాకి జీవి ప్రకాష్ సంగీతం అందిస్తుండగా ఈ జూలైలో సినిమాని రిలీజ్‌కి తీసుకొస్తున్నారు.

# సౌండ్ సెట్స్‌లో 'ఆయా షేర్'

నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' ప్రాజెక్టు నుంచి ఇటీవల విడుదలైన 'ఆయా షేర్' సాంగ్ సోషల్ మీడియాలో అదిరిపోయే రెస్పాన్స్ దక్కించుకుంటోంది. యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్ సాధించడంతోపాటు ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాది రీల్స్‌తో ఈ పాట ట్రెండ్ అవుతోంది. ఈ పాటలో హీరోను స్లమ్ స్మార్ట్‌గా చూపించేందుకు చిత్రబృందం భారీస్థాయిలో సెట్స్ నిర్మించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. 'ఆయా షేర్' పాట చిత్రీకరణ కోసం దాదాపు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేకంగా స్లమ్ సెట్స్ రూపొందించారు. ఇందులో హీరో ఇంటికోసం ప్రత్యేకంగా ఒక కమాన్ స్టైల్ హౌస్ సెట్ నిర్మించారు. ఈ పాటలో కనిపించే మరో ప్రధాన హైలెట్ వాటర్ బాడీ విలేజ్ సెట్. ఇది కూడా రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో రూపొందించబడింది. ఇందులో డమ్మీ సెట్స్ కాకుండా నిజమైన ఇళ్లలా కనిపించేలా సుమారు 60 ఇళ్లు నిర్మించారు. గ్రామం మధ్యలో ఉండే



వాటర్ బాడీ కోసం సుమారు 100 ట్యాంకర్ల నీటిని తీసుకువచ్చి వారంపాటు నింపారు. అదనంగా మరో చిన్న చెరువును కూడా తవ్వి సహజత్వాన్ని తీసుకొచ్చారు. సెట్స్ సహజంగా కనిపించేందుకు ఏజింగ్ టెక్నిక్స్ ఉపయోగించినట్టు చిత్రబృందం వెల్లడించింది. 'ది ప్యారడైజ్' చిత్రానికి దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. ఆయనకు ఇది నానితో రెండో సినిమా. గతంలో నాని హీరోగా వచ్చిన 'దసరా' సినిమాతో ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ సినిమాను నిర్మించిన సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను కూడా నిర్మిస్తున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది.

# వర్మనుంచి సర్కార్-4



దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తన ఐకానిక్ పొలిటికల్ క్రైమ్ ఫ్రాంచైజీ 'సర్కార్' నుంచి నాలుగో భాగాన్ని అధికారికంగా ప్రకటించారు. ముంబైలో జరుగుతున్న రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన, 'సర్కార్ 4' చిత్రానికి సంబంధించిన పనులను వచ్చే నెలనుంచే ప్రారంభించబోతున్నట్టు వెల్లడించారు. 2005లో అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రలో వచ్చిన 'సర్కార్' చిత్రం ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఆ తర్వాత 2008లో 'సర్కార్ రాజ్', 2017లో 'సర్కార్–3' చిత్రాలు విడుదలయ్యాయి. దాదాపు తొమ్మిదేళ్ల విరామం తర్వాత సిరీస్‌లో మరో భాగం వస్తుండటంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా వర్మ తన మరో ప్రాజెక్ట్ 'ది సిండికేట్' గురించీ ప్రస్తావించారు. అదేవిధంగా ఫిల్మ్ ఫెస్టివల్‌లో తన క్లాసిక్ హిట్ 'శివ' చిత్ర ప్రత్యేక ప్రదర్శనలో పాల్గొన్న ఆయన, ఆ సినిమా మేకింగ్‌పై హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ ప్రభావం ఉందని గుర్తు చేసుకున్నారు. వచ్చే నెలలో షూటింగ్ ప్రారంభం కానున్న 'సర్కార్–4'లో సుభాష్ నాగ్రేగా అమితాబ్ బచ్చన్ మళ్లీ ఎలా ఉండబోతున్నాడా? అని అభిమానులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.

# కొరియా వీధుల్లో కనకరాజు



హీరో వరుణ్ తేజ్ తన రాబోయే చిత్రం 'కొరియన్ కనకరాజు' షూటింగ్‌తో బిజీగావున్నారు. తాజాగా కొరియాలో స్థానికులతో కలిసి సరదాగా గడుపుతున్న కొన్ని క్యాండిడ్ ఫోటోలను ఫ్యాన్స్‌కి షేర్ చేశారు. రేపటినుంచి సినిమా ఫైనల్ షెడ్యూల్ ప్రారంభంకానున్న నేపథ్యంలో, దొరికిన కాస్త ఖాళీ సమయాన్నీ వరుణ్ ఇలా కొరియన్లతో ముచ్చటిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట సందడి చేస్తున్నాయి. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. ఇటీవల విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన రావడం సినిమాపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడంతోపాటు భయపెట్టే హారర్ కామెడీ నేపథ్యంలో వస్తున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాయి. టాలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే షూటింగ్ పనులన్నీ పూర్తి చేసి, ఈ ఏడాది చివర్లో 'కొరియన్ కనకరాజు'ను థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# పెళ్లికి రెడీ అవుతున్న స్వీటీ



దక్షిణాది చిత్ర పరిశ్రమలో 'లేడీ సూపర్ స్టార్'గా వెలుగొందిన అనుష్కశెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీవర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలాకాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్నప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం 'కథనార్' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

# ఓటీటీలో మంచి రెస్పాన్స



సంతోష్ శోభన్ హీరోగా మానస వారణాసి హీరోయిన్‌గా దర్శకుడు అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కించిన బ్యూటిఫుల్ ఎమోషనల్ లవ్ డ్రామా థియేటర్స్‌లో చూసిన అందరినుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. అయితే ఈ సినిమాకి థియేటర్స్‌లో వచ్చిన రెస్పాన్స్ డెఫినెట్‌గా దీనిలో ఉన్న కంటెంట్‌కి ఇంకా ఎక్కువ రావాలని చాలామంది ఆశించారు. ఇది ఫైనల్‌గా ఓటీటీలోకి వచ్చాక అది నెరవేరిందని చెప్పాలి. అమెజాన్ ప్రైమ్ వీడియోలో సినిమా వచ్చాక తెలుగు, తమిళ ఆడియెన్స్‌నుంచి కూడా మంచి స్పందన అందిస్తున్నారు. ఒక బ్యూటిఫుల్ సినిమాని తాము చూశామని సోషల్ మీడియాలో చెబుతున్నారు. దీనితో కపుల్ ఫ్రెండ్లీ చిత్రం మరింత సక్సెస్‌ని అందుకుందని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి ఈ సినిమాకి ఆదిత్య రవీంద్రన్ నిర్మాణం వహించగా యూవీ కాన్సెప్ట్స్ నిర్మాణం వహించారు. అలాగే యూవీ క్రియేషన్స్ సమర్పణలో రిలీజ్‌కి వచ్చింది.